ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

సెప్టెంబర్ 4, 2005

ఈ పురుగులు రైతు మిత్రులు

బల్బ్ పెయింటింగ్ ఎలా?

నేర్చుకుందాం..రా...

గ్రహాంతరవాసులెలా ఉంటారు ?

విజ్ఞాన వీచిక

మాలపిల్ల

సినిమా కబుర్లు

హ్యాపీ బర్త్ డే

4.9.2005 నుంచి
10.9.2005 వరకు

చందన
3సం॥, 4.9.2002
శైలజ-సుబ్రమణ్యం
విరాట్‌నగర్-ప్రకాశం

సుభాషిణి
4సం॥, 4.9.2001
నర్సమ్మ-సంజయ్‌మిత్ర
సీతానగరం-ఖమ్మం

మౌనిక
9సం॥, 6.9.1996
ఆగ్నేసు-ఆంద్రియ్య
రాజరాజేశ్వరి పేట-విజయవాడ

జి. దేవరాజశ్రీ
1సం॥, 6.9.2004
భవాని-భాస్కరరావు
అనంతవరం-ప్రకాశం

రావెళ్ల ఖ్యాతివర్ధన్
2సం॥, 8.9.2003
రాజి-శ్రీనివాసరావు
మాచవరం-విజయవాడ

పి. చైతన్యరాజ్
సుజత-వెంకటేష్
బాలానగర్-రంగారెడ్డి

బి. అరుణ్‌కుమార్
10సం॥, 10.9.1995
ఉమాదేవి-ఆదిశేషు
పాణ్యం-కర్నూలు

లక్ష్మిత
వాణి-భాస్కర్
మలక్‌పేట్-హైదరాబాద్

జి. సంకీర్తన
3సం॥, సెప్టెంబర్-2002
మేఘమాల-చందు
మల్కాజ్‌గిరి-హైదరాబాద్

ఎ. బిందుశ్రీ
5సం॥, 9.9.2000
నాగలక్ష్మి-వెంకటరామారావు
గన్నవరం-కృష్ణా

బ్లెస్సీరావు
విజయ-జయరావు
కొత్తగూడెం-ఖమ్మం

డి. సుప్రజ
10సం॥, సెప్టెంబర్-1995
సుశీలమ్మ-నర్సయ్య
వెంకన్నపాలెం

ఎస్. చిల్లి
6సం॥, సెప్టెంబర్-1999
జయమ్మ-జయప్రకాశ్
కర్నూలు

అపరిచితుడు
సెప్టెంబర్-5
బాలమణి-రాము
అక్కారం-మ॥నగర్

శిరోద్కర్‌సేన్
సెప్టెంబర్-5
బాలమణి-రమేష్
అక్కారం-మ॥నగర్

ఈ వారం అతిథి



మన అతిథి గురించి...

పేరు : డా॥ సి. నారాయణరెడ్డి
పుట్టిన ఊరు : కరీంనగర్‌జిల్లా హనుమాజీపేట
తేదీ : 1931 జులై 29
విద్య : ఎం ఏ పిహెచ్‌డి.
నచ్చిన వ్యక్తి : జవహర్‌లాల్ నెహ్రూ
నచ్చని అంశం : ద్వేషం
హాబీ : సంగీతం, సినిమా

స్వాభిమానం...దురభిమానం...!?

"స్వాభిమానం సభ్య లక్షణం
దురభిమానం ధూర్త లక్షణం"

అన్నాను ఒకచోట. స్వీయ వ్యక్తిత్వం గురించి ఒక దృఢవిశ్వాసం ఉండటం స్వాభిమానానికి తొలిమెట్టు. ఆ స్వాభిమానమే వెర్రితలలు వేస్తే అది దురభిమానమవుతుంది. నేను బాగా రాయగలను అని అనుకోవడం స్వాభిమానం. నేను మాత్రమే బాగా రాస్తాను అని గొప్పలు చెప్పుకోవడం దురభిమానం.

ప్రతీవ్యక్తి పాటించదగిన జీవనమూల్యాలు కొన్ని ఉంటాయి. అవి నైతిక, భౌతిక, ఆర్థిక, సామాజిక దశలలో విస్తరించి ఉంటాయి. ఈ అన్నిటిలోనూ అంతర్లీనంగా ఉన్న ఆ విలువలను సభ్యసమాజానికి విఘాతం కలగకుండా పరిరక్షించుకోవడం ఉత్తమ సంస్కారం. ఉదాహరణకు మాతృభాషలో మాట్లాడటం, అధ్యయనం చేయడం. ఇవి మౌలికసూత్రాలు. ఈనాడు క్రమక్రమంగా ఇవి సన్నగిల్లుతున్నాయి. పరపాలన నుంచి మన జాతి విముక్తమయిన తరువాత రోజురోజుకూ పరభాషాదాస్యం, దాస్యచిత్తవృత్తి పెరిగిపోవడం అవాంఛనీయం. ఒక ప్రముఖ ఇంగ్లీషు కవి, "Every civilized nation speaks in her own mother tongue" అన్నాడు. మరి ఈ ప్రకటనను బట్టి మనం ప్రశ్నించుకోవాల్సివస్తుంది. ఏమని? మన జాతి నాగరిక జాతా...అనాగరిక జాతా అని. ప్రైవేట్ స్కూళ్లలో, కాన్వెంట్ స్కూళ్లలో సర్వత్రా అమలులో ఉన్నది ఇంగ్లీషు మాధ్యమమే. ఈ మధ్య ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రాథమిక దశనుంచే ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టాలని సంకల్పించడం నాలాంటి వాళ్లకు మనస్తాపం కలిగిస్తున్న సన్నివేశం.

ప్రపంచంలోని ఏ స్వతంత్రదేశం కూడా పరభాషల్లో బోధన జరపదు, పరిపాలన జరపదు. మన తెలుగునాట ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతుందో? ఇది ఒకరకంగా బహుళజాతి కంపెనీల ప్రాబల్యం వల్ల అని నా అభిప్రాయం. చివరికి కోకాకోలా వంటి పానీయాలను ప్రవేశపెట్టి మన దేశీయపానీయాలను అణగదొక్కుతున్నారు ఈ బహుళజాతి సంస్థలు. సభ్యతతో జీవించవలసిన సమాజం వ్యాపారం గుప్పెట్లో పడితే మానవమూల్యాలు ఎక్కడుంటాయి? ఇది మరొకరకమైన పారతంత్ర్యమనే నా భావన. అలాగే నైతిక విషయాల్లో కూడా మన సమాజంలో విశృంఖలత్వం చోటు చేసుకుంటున్నది. ఏ గడ్డి తినైనాసరే డబ్బు సంపాదిస్తే చాలు అన్న దృష్టి నానాటికీ విస్తరిస్తున్నది. ఇటు భాషావిషయకంగా అటు నైతికంగా ఏర్పడుతున్న ఈ విషమ పరిణామాలకు స్వస్తి పలకవలసిన సమయం ఆసన్నమైంది. లేకుంటే వేల సంవత్సరాల సభ్యతానాగరికతలున్న భారతదేశం తన మౌలికతను కోల్పోయే ప్రమాదముంది. మరోసారి గుర్తు చేస్తున్నాను...స్వాభిమానరహితంగా జీవించే సమాజం జీవచ్ఛవమని!

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
నేర్చుకుందాం..రా! ... 7
క్యాంపస్ చాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
తెంగ్లీషు ... 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 8
మాధవి

ఇంకా...



మనసా తెలుసా 3
ప్రేమ ఎలాపుడుతుంది ?

దిష్టిబొమ్మల కొలువు
కథ 18 ...
ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

విలక్షణ నేత

"అట్టమీది కథ" 'విలక్షణ దేశాధినేత మన్మోహన్ సింగ్' ఆయన వృత్తి, ప్రవృత్తి రెండూ ఆర్థికమేనని తెలియజేసింది. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని కావడమే ఓ విలక్షణమంటూ ప్రారంభించి, ఇంకా మూడున్నర సంవత్సరాల పాటు అధికారంలో ఉండేందుకవకాశముందంటూ ముగించడం చాలా బాగుంది. 'నానావతి నివేదికపై జరిగిన చర్చలో ఆయన చేసిన ప్రసంగాలనుదహరించడం అభినందనీయం.

సిరిపురపు రామకోటేశ్వర రావు,
ఎనికేపాడు



నవ్వు తెప్పిస్తున్నాయి

"స్నేహ" సంచికలో వారం వారం వస్తున్న కార్టూన్స్, జోక్స్ బాగా నవ్వు తెప్పిస్తున్నాయి. మేం పుస్తకం కోసం ప్రతివారమూ ఎదురుచూసేలా చేస్తున్నాయి. ఆదివారమంతా మేం నవ్వుతూ గడిపేలా చేస్తున్న "స్నేహ"కి మా కృతజ్ఞతలు. 'హేపీబర్త్‌డే', 'రుచి' శీర్షికలు చాలా బాగున్నాయి. 'రుచి' చదివిన వెంటనే వండడానికి సిద్ధపడే వంటకాలనందిస్తోంది.

రాగిణి, కొత్తగూడెం

ఎప్పటి నుంచో...

"స్నేహ" సంచికలోని శీర్షికలన్నీ చాలా బాగుంటున్నాయి. ఆదివారమొస్తే స్నేహితులందరమూ కూర్చుని చదువుతున్నాం. "ఉంచుకోండి తాజాగా" మాకెంతగానో నచ్చింది. ఇల్లు సర్దుకోవడమెంత ముఖ్యమో మాకు బాగా తెలిసింది. "ఇంటి సంగతులు" మీద మరెన్నో రచనలొస్తే బాగుంటుంది.

జె. శ్రావణి, ఎస్.సి.ఎస్. అనుష్క, పాల్వంచ

టపా

కళ్లముందు కదలాడేలా...

సంసార జీవితంలో ఎదురయ్యే సంఘటనలను కళ్లముందు కదలాడేట్లుగా చేసింది "చెదిరిన జ్ఞాపకాలు". ఈ కథలోని పాత్రలను సృష్టించిన తీరు చాలా బాగుంది. "సినిమా కబుర్లు" శీర్షికలో చిత్రపరిశ్రమలో ప్రస్తుతం చోటుచేసుకున్న మార్పుల గురించి విబి రాజేంద్రప్రసాద్ చాలా చక్కగా తెలియజేశారు. పెండెం జగదీశ్వర్ చమత్కార సంఘటనలు ఈ వారం అనుబంధానికి హైలైట్ అని చెప్పొచ్చు.

కొప్పుల కాశీవిశ్వేశ్వరరావు, మర్రిపాలెం

ఉపయోగకరంగా...

"సలహాలు" శీర్షిక చాలా బాగుంది. దీని ద్వారా అందించే న్యాయసలహాలు చాలా ఉపయోగకరంగా, పరిష్కారాన్ని చూపే విధంగా ఉన్నాయి. ప్రతివారం న్యాయసలహాలు ఉచితంగా మాకందిస్తున్నందుకు "ప్రజాశక్తి" దినపత్రిక సిబ్బందికి మా ధన్యవాదాలు.

కామేశ్వర్, సోమల

చిరకాలం వర్ధిల్లాలి

మా అభిమాన పత్రిక 'ప్రజాశక్తి' రజతోత్సవ సంబరాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా మేం హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాం. ఇలాగే మరిన్ని మెట్లెక్కుతూ శతవసంతాలు పూర్తిచేసుకుని చిరకాలం వర్ధిల్లాలని కోరుతూ.....!

'ప్రజాశక్తి'

బి. రాజేశ్వర్, పొన్కల్

మనసా... తెలుసా?

హఠాత్తుగా ప్రేమ మెరవదు. ఒక్కసారిగా ప్రేమలో పడిపోవడమన్నది సిన్మాల్లో మాత్రమే సాధ్యమయ్యే విషయం వాస్తవ జీవితంలో ఇది ఒక అరుదయిన అవకాశం లాంటిది. స్నేహం కూడా ప్రేమకు దారితీయెుచ్చు. ఎపుడేది ప్రేమగా మారుతుందో, అదెలా మొదలవుతుందో చెప్పడం కష్టం. ఇంతకీ స్థిరమైన ప్రేమ ఎలా...

ప్రేమ ఎలా పుడుతుంది ?

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్
పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్
ఫోన్ : 9849130141

ప్రేమ భావనలు పొందటానికందరూ సిద్ధంగా ఉంటారని చెప్పటానికాధారాలు లేనప్పటికీ, ప్రతి వ్యక్తీ ప్రేమ భావాలకు సుముఖంగా ఉంటాడని మాత్రం కచ్చితంగా చెప్పొచ్చు. సుముఖంగా ఉండే వారంతా ప్రేమలో పడాలనీ లేదు. అయితే ప్రేమలోపడే అవకాశాలను ఇది అభివృద్ధి పరుస్తుంది. ఇలా ప్రేమకు సంసిద్ధులై ఉండడానికి మూడు అంశాలున్నాయి.

ప్రేమ అమరమైనది : ప్రేమ బాధించే విషయమో, అలసటకు గురిచేసేదో కాదు. ప్రేమ అందరికీ వాంఛనీయమైంది. మానసికంగా ప్రయోజనకరమైంది. కాల్పనిక ప్రేమలో (రొమాంటిక్ లవ్) పడటం ఒక బలహీన లక్షణమని, తమ వ్యక్తిగతాభివృద్ధికిది అడ్డంకి లాంటిదని భావించే కొంతమంది ప్రాక్టికల్ వ్యక్తులు ప్రేమలో పడరు. కానీ ప్రేమ ఔన్నత్య పూరితమైనదని, తమలోని ఉన్నత భావాలను తెలియచేసేదని భావించేవారు తగిన జతకోసం చూస్తారు.

తపన : ఇక రెండోది, పరస్పర ఒద్దికకు, సాహచర్యానికి తపించడం. ఈ తపన ఒంటరితనం వల్ల, ఇతరుల ప్రేమ కలాపాలను చూడడం వల్ల ఏర్పడిన అసూయ కారణంగా ఏర్పడవచ్చు. లేదా గతకాలపు ప్రేమను భర్తీ చేయడం కోసం ఏర్పడవచ్చు. అంటే ఇంత వరకు, టీనేజి వయసుకు ముందు ఆలంబనగా నిలిచిన ఏదేని ఒక ఆత్మీయతానుబంధం ఇపుడు ఏర్పడే శారీరక, మానసిక ప్రతిస్పందనలకు సమంజసనీయమైంది కానట్టుగా అన్పించడం. **ప్రేమ** అనే భావనకు మనసులోనున్న అభిప్రాయానికి ముడిపడి ఉన్న పలు మధురోహలను నిర్బంధరహితంగా ఆపాదించగల, అవరోధ భావాలకు లోనుకాకుండా నిస్సంకోచంగా ముడిపెట్టగల ఒక విజాతి వ్యక్తికి పట్టాభిషేకం చేయాలని కలిగే ఊహల తమకం చేత ప్రేరేపితమవుతుంది.

అసంతృప్తి: ఇక మూడవది, ప్రేమలో ఏర్పడిన అసంతృప్తి. ఈ అసంతృప్తి లైంగికకాముకత సంతృప్తం కాకపోవడం వల్ల ఏర్పడుతుంది. ఫ్రాయిడ్ చెప్పిన శైశవ దశలోని లిబిడో తీరకపోవడం మూలంగాను లేదా ఒక వ్యక్తితో ఉన్న అనుబంధం తాను అనుకున్న విధంగా తీవ్రమైన వాంఛ, ఒప్పందాలతో కూడుకున్న సంబంధం కాకపోవడం వల్ల ఏర్పడుతుంది. ఈ కోవకు చెందిన వ్యక్తులు ఏదో ఒక బలహీన క్షణంలో తాత్కాలికంగా లైంగిక క్రియలో పాల్గొనొచ్చు కానీ అది వారికి తనివితీర్చదు. చివరగా ప్రేమకు సంసిద్ధంగా ఉండటం మూలంగా తామెవరి చేతనయినా ప్రేమింపబడవచ్చుననే ఆశ, నమ్మకం కల్గిస్తుంది. ఈ పరిస్థితుల్లో వ్యక్తులు, వయసు పెరుగుతున్న కొద్దీ కాల్పనిక ప్రేమకు వశం కావడం, తగ్గిపోతూ ఉంటుంది. డోరతిటిన్నావ్ ప్రకారం, వారి భావాలకు బలైపోతూ వారే, దీపం చుట్టూ



తిరిగే పురుగులా మారే అవకాశాలు తగ్గిపోవడమే ఇందుకు కారణం.

ప్రేమ తర్కానికి అతీతమైనది : కొంతమంది వ్యక్తులిలా ప్రేమకు సంసిద్ధంగా ఉంటారు కానీ విజయం సాధించలేరు. కాల్పనిక ప్రేమపట్ల వారికున్న భావాలకు కాస్త రాయితీ కల్పించుకుంటారు. కాల్పనిక ప్రేమ కానట్టి సంబంధాలలో పాల్గొంటారు. తత్ఫలితంగా వారి అన్వేషణ ఒక ముగింపు దశకు రాదు. ప్రేమించటానికి సంసిద్ధమయ్యే ముందు, యువతీయువకులు దీనినెవరూ కొలవలేనిదని గ్రహించాలి. కవులు, పండితులు చెప్పినట్టుగా ప్రేమ ఎప్పుడు, ఎలా మొదలౌతుందో చెప్పలేం. అలాగని ఇది మహిమాన్వితమైంది కాదు. ఏదో అదృశ్య శక్తి ప్రభావంచేత ఏర్పడేది కాదు. పూర్వజన్మ ఫలితంగానో లేక జన్మ జన్మల అనుబంధం కారణంగానో ఏర్పడేది అంతకన్నా కాదు. మీరనుకున్న లక్షణాలు గల వ్యక్తి తారసపడటం నిజజీవితంలో అరుదని గ్రహించాలి. ప్రేమ సహేతుకమయినదికాదు. ముందుగా అనుకునేది ఏమాత్రం కాదు. ప్రేమను మొలకెత్తించేది ఏమిటన్నది ఇంకా అయోమయం. "తొలిచూపులోనే ప్రేమ" అనే బిందువు దగ్గర్నుంచి, అనేక నెలలు లేదా సంవత్సరాల మధ్య కాలంలో జరిగే దశలో ఎక్కడో ఒకచోట ఈ ప్రేమనేది ప్రారంభమౌతుంది. వ్యక్తిలో ప్రేమకు సంసిద్ధత ఉంటే కానీ, హఠాత్తుగా ప్రేమ మెరవదు. ఒక్కసారిగా ప్రేమలో పడిపోవడమన్నది సిన్మాల్లో మాత్రమే సాధ్యమయ్యే విషయం. వాస్తవ జీవితంలో ఇది ఒక అరుదయిన అవకాశం లాంటిది. అలాగని ఇది ఒక

'నిబంధన ' ఎంత మాత్రమూ కాదు. ప్రేమలో పడడం అనే ప్రక్రియ చాలా రకాలుగా సంభవించొచ్చు. ఒకసారి స్త్రీ పురుషులిద్దరూ కలుసుకునే డేటింగు పద్ధతిలో, పరస్పర అవగాహనకు అవకాశమేర్పడొచ్చు. శారీరకంగా ఒకవ్యక్తికి దగ్గరగా ఉండడమనేది వేరేదారి. సాన్నిహిత్యంలో ప్రేమ విషయం బయటికి పొక్కకుండా, పరస్పర వాంఛనీయ లక్షణాలున్నాయెూ లేదో పరిశీలించుకోవచ్చు. స్నేహం కూడా ప్రేమకు దారితీయెుచ్చు. ఎపుడేది ప్రేమగా మారుతుందో, అదెలా మొదలవుతుందో చెప్పడం కష్టం. ఒకరంటే ఒకరికి గల నమ్మకం, దగ్గరతనం, ఉద్వేగ పూర్వకమైనదిగా కాకుండా ఉన్నపుడు ప్రేమ పుట్టొచ్చని టెన్నోవ్ అభిప్రాయం.

❀

టర్నింగ్ పాయింట్

1908లో ఆస్ట్రియా (హంగరీ), సెర్బియా దేశాలకు మధ్య స్పర్థలు పెరిగాయి. బోస్నియా, హెర్జిగోవినా ప్రాంతాలను ఆస్ట్రియా ఆక్రమించుకుంది. వాటిని ఆల్బేనియా పేరుతో ప్రత్యేక దేశంగా చేసి, తన ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో సెర్బియా సముద్రమార్గం ఏమైంది ?

వకుళాభరణం రామకృష్ణ

హత్యసాకుతో మొదటి ప్రపంచ యుద్ధం

అది జూన్ 28, 1914...
ఆస్ట్రియా దేశపు యువరాజు ఆర్చిడ్యూక్ ఫ్రాన్సిస్ ఫర్డినాండ్, తన భార్యతో కలిసి బోస్నియా దేశ రాజధాని సెరాజివో నగర వీధుల్లో వెళుతున్నాడు. అకస్మాత్తుగా... వాళ్ళిద్దరిపై కాల్పుల వర్షం కురిసింది. దాంతో వారిరువురూ మృత్యువాతబడ్డారు.

పందొమ్మిదవ శతాబ్దాంతానికి పెట్టుబడిదారీ విధానం గుత్త స్వభావాన్ని సంతరించుకొని సామ్రాజ్యవాదంగా రూపుదిద్దుకుంది. జర్మనీ, ఇటలీ దేశాలు 1870లో ఏకీకరణ సాధించాయి. వలసల వేటలో ఇంగ్లండు, ఫ్రాన్సులతో పోటీపడ్డాయి. ఫిలిప్పీన్స్‌ను అమెరికా ఓడించింది. తన సామ్రాజ్యవాద స్వభావాన్ని రుజువు చేసుకుంది. ఇక దూరప్రాచ్యంలో అతి చిన్న దేశమైన జపాన్, ఆర్థికంగా బలపడింది. సైనిక శక్తిగా ఎదిగింది. చైనాను ఓడించింది. 1905లో రష్యాను కూడా ఓడించింది. ఈ ఘటన ప్రపంచాన్నే అబ్బురపరిచింది. ఈ సంఘటనలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సామ్రాజ్యవాదదేశాల మధ్య రోజురోజుకూ వలసల కోసం, ప్రపంచాధిపత్యం కోసం పోటీ తీవ్రతరమైంది. ఇది ఏ పరిణామాలకు దారితీస్తుందన్నదే అందర్నీ కలవరపరుస్తున్న సమస్య.

ఇరవయ్యో శతాబ్దారంభానికి ఐరోపాఖండంలోని అగ్రరాజ్యాలు రెండు కూటాలుగా చీలిపోయాయి. ఫ్రాన్స్, రష్యా దేశాలు ఇంగ్లండ్ నాయకత్వంలో ట్రిపుల్ ఎన్టెంట్‌గానూ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీ దేశాలు జర్మనీ పర్యవేక్షణలో ట్రిపుల్ అలయన్స్‌గానూ ఏర్పడ్డాయి. ఈ రెండు కూటములు పరస్పర అనుమానంతో, భయంతో తమ సైనిక శక్తిని అపారంగా పెంచుకున్నాయి. ఒకదానిపై మరోటి కయ్యానికి కాలుదువ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో 1908 ఆస్ట్రియా (హంగరీ), సెర్బియా దేశాలకు మధ్య స్పర్థలు పెరిగాయి. బోస్నియా, హెర్జిగోవినా ప్రాంతాలను ఆస్ట్రియా ఆక్రమించుకుంది. వాటిని ఆల్బేనియా పేరుతో ప్రత్యేక దేశంగా చేసి, తన ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో సెర్బియా సముద్రమార్గం మూసుకుపోయింది. దాని విదేశీ వాణిజ్యం దెబ్బతింది. ఫలితంగా ఆ దేశం ఆర్థికంగా నష్టపోయింది. అయినా దీని ప్రాబల్యాన్ని ఆస్ట్రియా తగ్గించలేకపోయింది. సంధి షరతుల ప్రకారం ఆస్ట్రియా కొమ్ముకాయడానికి జర్మనీ సిద్ధంగానే ఉన్నప్పటికీ, యుద్ధానికి సుముఖతను వ్యక్తం చేయలేదు. సరైన అదను రాలేదని ఆస్ట్రియాకు నచ్చజెప్పింది.

సరిగ్గా, ఆ సమయంలోనే సంభవించిన ఆస్ట్రియా యువరాజు దంపతుల హత్యతో... ఆస్ట్రియాకు అవకాశం లభించింది. హంతకులు నిజానికి ఆస్ట్రియాదేశ వాసులే! అయినా వారు సెర్బియా జాతికి చెందిన వారు కావడంతో ఆవేశాలు పెరిగిపోయాయి. ఈ వార్త ఆస్ట్రియా మొత్తం వ్యాపించింది. సెర్బియన్లను, 'హంతకజాతి' గా అభివర్ణించింది ఆస్ట్రియా. ఈ హత్యకు సెర్బియా బాధ్యత వహించాలని ప్రకటించింది. వార్తా

పత్రికలన్నీ యుద్ధ నినాదాలతో నిండిపోయాయి. సెర్బియాకీ ఉదంతంతో సంబంధం లేదని రుజువయినా, ఆ రిపోర్టును బహిర్గతం చేయలేదు ఆస్ట్రియా. ఆ దేశంపై యుద్ధాన్ని ప్రకటించడానికి చేజిక్కిన అరుదైన అవకాశాన్ని చేజార్చు కోవాలనుకోలేదు.

జర్మనీతో రహస్య మంతనాలు సాగించింది. యుద్ధానికేర్పాట్లు ప్రారంభించింది. జర్మనీ ఎటువంటి షరతులూ విధించకుండా తన మద్దతును ఆస్ట్రియాకు ప్రకటించింది. యువరాజు, రాణిల హత్యకు బాధ్యత వహిస్తూ, పది డిమాండ్లతో కూడిన అల్టిమేటం సెర్బియాకిచ్చింది. దాన్నంగీకరిస్తే, సెర్బియా తన సార్వభౌమాధికారాన్ని కోల్పోయే ప్రమాదముంది. ఇటువంటి పరిస్థితుల్లో యుద్ధం అనివార్యమైంది. అదే మొదటి ప్రపంచయుద్ధం. జర్మనీ, ఇటలీ ఆస్ట్రియాకు మద్దతుగా నిలిచాయి. సెర్బియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా రంగంలోకి దిగాయి. ఫర్డినాండ్ దంపతుల హత్య ప్రపంచ చరిత్రనే ఓ మలుపు తిప్పింది. వినాశకర సంగ్రామానికి తెరదీసింది. ✻

ఏ ఆధారమూ లేదు

మా తాతగారు సంపాదించిన పొలం మూడెకరాలు. ఆయనకు ముగ్గురు కొడుకులు. అందులో ఎకరంన్నర ఆయన పేరుమీదే రిజిస్ట్రేషనయింది. మిగతా ఎకరన్నర రిజిస్ట్రేషన్ చేయలేదు. అగ్రిమెంటు రాయించుకున్నాడు. పొలం కాగితాలు మా బాబాయి దగ్గరుండేవి. నాయనమ్మ, తాతయ్య చనిపోయిన తరువాత మా పెదనాన్నగారు రిజిస్ట్రేషన్ కాని ఎకరం తీసుకున్నారు. బాబాయి రిజిస్ట్రేషన్ అయినది అర ఎకరం కానిది అర ఎకరం తీసుకున్నారు. అగ్రిమెంట్ కాగితం మా బాబాయి దగ్గరుంది. దాన్ని మాకివ్వమని అడిగాం. ఆయన పోయిందంటున్నాడు. మాకిప్పుడు ఏ ఆధారమూ లేదు. తగిన సలహా ఇవ్వగలరు.

వీర రమేష్

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

మీ పిల్లలకు...

నేను ఎస్టీని. ఓసీ అబ్బాయిని 18-7-84లో పెళ్లి చేసుకున్నాను. వేం స్వగ్రామంలోనే ఉంటున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. అప్పటి రెవెన్యూ అధికారులు నా భర్త ఇంటి పేరుతో నా కులం (ఎస్టీ) కింద ధృవీకరించారు. ఇప్పుడు మా పిల్లలు పెద్దవాడు డిగ్రీలో చేరడానికి కుల ధృవీకరణ పత్రము ఇవ్వబోమని మా కార్యదర్శి అంటున్నారు. ఇప్పుడు మా పిల్లలకు ఏ కులం వర్తిస్తుంది. పరిష్కారము తెలుపగలరు.

ఒక అభాగ్యురాలు , శ్రీకాకుళం జిల్లా.

మీ తాతగారు ఆస్తి ఎవరి వద్ద కొన్నారో తెలుసుకోండి. వారిని సంప్రదించండి. మీ తాతలకాలం నుండి ఆస్తి మీ ఆధీనంలోనే ఉందనీ, అందుకే మీ వాటాకొచ్చిందనీ తెలిపే ఆధారాలు, (శిస్తులాంటివి) మీ దగ్గరుంచుకోండి. అలాంటివేవీ మీ దగ్గర లేకపోతే మీకు ఆస్తి అమ్మిన వారిని అడిగి చూడండి. వారితో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

కులాంతర వివాహాల వల్ల కలిగే పిల్లలకు వారి యొక్క తండ్రి కులమే వర్తిస్తుంది. తల్లి కులం వర్తించదు. జన్మత : ఏ కులం అయితే అదే వర్తిస్తుంది. కావున మీకు ఎస్టీ వర్తించదు మీ పిల్లలకు, మీ భర్త కులం వర్తిస్తుంది.

అదేం పిచ్చి ప్రశ్న

ఓ పిచ్చివాడు డాక్టర్ దగ్గరకు వచ్చాడు
అతన్ని చూసిన డాక్టర్

డాక్టర్ : ఆఁ ! మీ జబ్బేమిటో చెప్పండి

పేషంటు : జబ్బేమిలేదే ?!

డాక్టర్ : మరి ఎందుకు వచ్చావు ?

పేషంటు : అదేం ప్రశ్న ? నీకు జబ్బు చేసిందని తెలిసి నేనొచ్చాను.

- అన్వేష్



ఇంటి సంగతులు

"చాలా బాగుంది గానీ ఇల్లు చిందర వందరచేస్తే నాకు మళ్లీ సర్దే ఓపికలేదు. మీరిక వినకపోతే నా దారి నాది మీ దారిమీది" అని గలగలా నవ్వింది శారద. "చూడండి! మాటంటే మాటే. నేను మాత్రం పరార్!" అలా అన్నారంటే ఏవిటీ గతి ?

రుక్మిణి

పుస్తకాలపురుగు-పేపర్ల చిరుగు

ఏ వండోయ్... శ్రీశ్రీ బాచి గారూ.. వింటున్నారా... చదువు విజ్ఞానాన్ని పెంచాలి. శ్రమను తగ్గించాలి. అంతేగానీ ఈ చెమట్లు పట్టించే విజ్ఞానం ఎందుకండీ బాబూ.... చస్తున్నాను... చాలు....ఈ చదువుకో దండం.... కాస్త ఈ బాధ తప్పిస్తే "వచ్చే జన్మలో మిమ్మల్ని నా మెడకు కట్టుకోనని ప్రామిస్" అని కూడా ఒట్టేసుకుంటున్నాను. ఏంటీ నేనన్ని ఆపసోపాలు పడి నెత్తీ నోరు బాదుకొంటున్నా మీకేం పట్టదా! అరే... ఆ పేపర్లో నుండి తల బయటికి తీయరే... ఆ తలకాయను తీసి ఆ టీపాయ్ మీద పెట్టమంటారా నన్ను?

శారద అరుస్తూనే ఉంది. బాచి అనే "బాలచిరంజీవి" కిక్కురు మనకుండా పేపర్లో మునిగిపోయారు.

'బాల చిరంజీవి' ఒక చిన్న ప్రభుత్వాఫీసులో పెద్ద గుమస్తా. శారద చిరంజీవికి భార్య. వారికిద్దరు పిల్లలు. బాచికి తెలుగు సాహిత్యంలో ఓ బుల్లి రచయితగా వెలిగిపోవాలని కోరిక. కనీసం జర్నలిస్టయినా కావాలనే ఆశ. అందుకే తన పేరును కత్తిరించి బాచి అని తగిలించుకున్నాడు.

"వెయ్యి వాక్యాలు చదివిగానీ ఒక వాక్యం రాసే సాహసం చేయాలి" అని ఎక్కడో చదివాను. నిజమే! ఎంత ఎక్కువగా చదివితే అంత పరిజ్ఞానమొస్తుంది. దాంతో రాయడంలోని మెళకువలు తెలుస్తాయి. అంతేగాక బాచికి చదువుకునే రోజుల్నుండే 'పుస్తకాల పురుగు' అనే పేరుండేది. కనపడిన పుస్తకాన్నల్లా చదవడమలవాటు చేసుకున్నాడు. ప్రతిరోజూ ఇంగ్లీషువి, తెలుగువి కలిపి ఓ అరడజను పేపర్లు తెప్పించుకుంటాడు. క్షుణ్ణంగా చదివేస్తాడు. వాటిని చాలా వరకు బుర్రలోకి ఎక్కించుకుంటారు. ఆఫీసులో కాస్తంత వెసులుబాటుంటే చాలు ఏదోక పుస్తకంలోకి దూరిపోతాడు. పై వాళ్లతో అడపాదడపా చివాట్లు తింటాడు.

ఇంట్లో టిఫిను చేసేటప్పుడు... భోజనం చేసేటప్పుడు తప్ప బాచి కాగితాన్ని వదలడు. చదవడంలోనే మనిషికి విజ్ఞానం, ఆనందం వస్తాయన్న మాటసరే! కానీ వచ్చిన చిక్కేమిటంటే, బాచి ఒక దాన్ని చదవగానే మరోదానిమీదకు పులిలా ఎగబడతాడు.

శారదకు ఒళ్లు మండేదక్కడే. ఇంటి నిండా.... వంటిట్లో , డైనింగ్ టేబులు దగ్గరా... ఎక్కడ చూసినా పేపర్లు... పత్రికలు.. పుస్తకాలు.

"ఏంటి మీ వారు 'పత్రికలయజ్ఞం' చేస్తున్నారా, పుస్తకయాగం చేస్తున్నారా', కొంపదీసి ఏ దైనా గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేరవుతున్నారా?"అని స్నేహితులంతా శారదనాటపట్టించేవారు. చివరికోరోజు శారద బాచిని కూర్చోబెట్టి క్లాసు తీసుకుంది.

చదివిన పేపర్లన్నింటినీ డేట్ల వారీగా సర్దుకోవాలి. వాటికి షెల్పులు లేకపోతే ఏ టేబుల్ కిందనో సర్దేయొచ్చు. ఇంటి నిండా చదివేసిన న్యూస్ పేపర్లు కాలి కిందపడి నలిగిపోతున్నాయి. గాలికి కొట్టుకొని ఫ్లోరింగ్ గోడలకు అతుక్కుపోయి, చాలా అసహ్యంగా కన్పిస్తున్నాయి.

ఇక పుస్తకాలు...

బాచి ఆదివారాల్లో ఓ చేతి సంచి తగిలించుకుని సెకెండ్ హ్యాండ్ పుస్తకాలమ్మే దుకాణాల మీదకెగబడతాడు. ఎంచుకున్నవి కొని తెస్తాడు.

వాటిలోని 'ముందుమాట' చదివి, ఇంట్లో టేబుళ్ల మీద, కుర్చీల మీద పెట్టేస్తాడు.

లైబ్రరీలో లాగా వాటిలోని విషయాన్ని బట్టి వరసలుగా విభజించుకోవాలి. కథలు, నవలలు, అనువాదాలు, సాహిత్య విన్యాసాలు, సమీక్షలు అలా పేర్చుకోవాలి. బాచీగారు భవిష్యత్తులో రచయితయ్యేవాడు కాబట్టి అనివార్యమైన, చోట ఏదైనా రిఫరెన్సుల కోసం వెతుక్కోవడం చాలా సులభం. ఇల్లు కూడా చాలా శుభ్రంగా ఉంటుంది. మరీ ముఖ్యం ఏమిటంటే కొన్ని పుస్తకాలు చిరిగిపోతుంటాయి. అలాంటి వాటిని కాస్తంత తీరుబాటు చేసుకుని కాస్తంత జిగురుతో 'రిపేరు' చేస్తే భావితరాల వారికీ ఉపయోగపడతాయి.

ఇలా చెప్పీ చెప్పీ శారద అలసిపోయింది. సాయంత్రం దాకా చెప్పిన విధంగా అన్ని సర్దేసింది. ఇపుడు ఇంట్లో గాలికి టపటప, రెపరెపమని ఎగరే పేపర్లస్సలు కనిపించలేదు. సగం తెరిచి, మడిచిన పుస్తకాలు శుభ్రంగా అల్మారాలోకెళ్లిపోయాయి.

బాచి వింతగా ఇంటినంతా పరిశీలించాడు.

"అది కాదే ఇల్లు సర్దిపడేశావ్ చూడముచ్చటగానే ఉంది. అంతేకాదు వీటిని చూస్తుంటే ఇంకా చూస్తూనే ఉండాలనే వెర్రి ఆవేశమొచ్చేస్తుంది" అని సంబరపడిపోయాడు.

"చాలా బాగుంది గానీ ఇల్లు చిందర వందరచేస్తే నాకు మళ్లీ సర్దే ఓపికలేదు. మీరిక వినకపోతే నా ఇల్లు నాది మీ ఇల్లు మీది" అని గలగలా నవ్వింది శారద.

"చూడండి! మాటంటే మాటే. నేను మాత్రం పరార్!" అంది అంతే సీరియస్‌గా.

నేర్చుకుందాం...రా!

బల్బు పేయింటింగ్ ఎలా?

అగస్త్యరాజు లక్ష్మీ సూర్యకళ
ఫోన్ : 55889954

ఇప్పటి వరకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ఎలా చేయాలి. చూశాం కదా! ఈ వారం మనం బల్బు పెయింటింగ్ గురించి తెలుసుకుందాం! గ్లాసు పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ గురించి విన్నాం. ఈ బల్బు పెయింటింగేంటబ్బా అనేగా మీ సందేహం. అక్కడికే వస్తున్నామండీ.



సాధారణంగా మనం బల్బులు మాడిపోగానే చెత్త కుండిల్లో పడేస్తాం. కాని కొంచెం కళాత్మకతను జోడించి వాటి మీదా మనం పెయింటింగ్ చేసుకోవచ్చు. వీటిని షోకేస్‌లో పెడితే చూపరులనాకర్షిస్తాయి. వీటికి పెద్దగా ఖర్చేమీ కాదు. వాడేసిన బల్బులు, ట్యూబ్ లైట్లు మిగిలిపోయిన నెయిల్ పెయింట్స్, నెయిల్ పెయింట్ వేసుకున్నాక దానిమీద అలంకరించుకోవటానికి ఉపయోగించే మెరుపు స్టార్స్‌ను ఉపయోగించుకోవచ్చు. వీటిని దేవుడు బొమ్మల్లోనూ కిరీటాన్ని తయారుచేసేటప్పుడు ఉపయోగిస్తే చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

ఏరకమైన బల్బులకెలాంటి డిజైన్స్ వేస్తే అందంగా ఉంటుందో తెలుసుకుందాం. చిన్న బల్బులకి తామర పువ్వు, ఇండియా మ్యాప్, వినాయకుడు, వెంకటేశ్వర స్వామి బొమ్మలను వేసుకుంటే అందంగా ఉంటుంది. ఇవన్నీ కష్టం అనిపించిన వాళ్లు బల్బు నిండా అక్కడక్కడా చుక్కలు పెట్టుకుంటే బాగుంటుంది. ఈ చుక్కల డిజైన్ మాడిపోయిన బల్బులకే కాకుండా వెలుగుతున్న వాటికీ ఉపయోగించాలి. దీని వల్ల కాంతి చుక్కల మధ్యనుంచి గదంతా పరుచుకుని చూపరులను మైమరిపింపజేస్తుంది. ట్యూబ్ లైట్లను పారేయకుండా అందమైన లతలను, పూలను వేసి కార్నర్స్‌లో డెకరేట్ చేసుకోవచ్చు. అందమైన ఆకృతిలో ఉన్న మందు సీసాల మీదా పెయింట్ వేసి అందులో పూలనుంచి టీవీ మీదగానీ, టీపాయి మీదగాని ఉంచుకోవచ్చు.



పై వాటినన్నింటినీ పిల్లలకందకుండా జాగ్రత్తగా అమర్చుకోవాలి. వచ్చే వారం మరో అంశంతో కలుసుకుందాం. ❀



సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

(9 వ భాగం)

గతవారం కథలో...

మాధవిని హర్యశ్వుడికి ధారవోయడంతో తన గురుదక్షిణకు కావాల్సినవి సమకూరుతాయనుకున్నాడు గాలవుడు. కానీ ఆ రాజు కొలువులో రెండొందల గుర్రాలే ఉండటంతో ఒక సంవత్సరం మాధవితో స్వర్గసుఖాలనుభవించి ఒక పుత్రుడు కని ఇచ్చే బేరం కుదుర్చుకున్నాడు. ఇక చదవండి...

మాధవి

అందమైన మాధవిని మరింత అందంగా అలంకరించారు. పరిమళభరితమైన పుష్పాలతో పూలజడ వేశారు. శరీరమంతా చందనలేపనం పూసి అత్తర్లు చిలకరించి గదిలోకి పంపించారు.

తన అందెల సవ్వడి తనకే బెరుకు కలిగిస్తుండగా చప్పుడు రాకుండా వీలైనంత మెల్లగా అడుగులేస్తూ వెళ్ళి మంచంపై కూర్చుంది మాధవి. చుట్టూ వున్న దీపస్తంభాలపై బంగారు కుందుల్లో దీపాలు వెలుగుతున్నాయి. అక్కడక్కడా అగరొత్తులు కాలుతూ పరిమళాలను వెదజల్లుతున్నాయి. గదినిండా రకరకాల సువాసనాభరితమైన పూలమాలలు వేళ్లాడదీసి వున్నాయి. వాటికితోడు సాంబ్రాణి పొగలు వ్యాపించి సుగంధపూరితంగా వుంది. బయటినుండి వస్తున్న గాలికి కిటికీలకున్న తెరలు రెపరెపలాడుతున్నాయి. చంద్రుడు పండువెన్నెలను కురిపిస్తున్నాడు. ఎటుచూసినా వాతావరణం హాయిగొలిపేలా వుంది.

కానీ మాధవి మనసులోని అలజడిని ఇవేవీ నివారించలేకపోగా మరింత పెంచాయి.

కన్నీరు కారుస్తూ గతాన్ని స్మరించుకుంది. తండ్రి తనకు స్వయంవరం ఏర్పాటు చేయగా అందరిలోకీ స్ఫురద్రూపి, ఉత్తముడుగా కనిపించిన యువరాజు మెడలో వరమాల వేయాలని కలలు కంది. అలా తనకు నచ్చిన రాకుమారుడైతే ఈ వాతావరణంలో పులకించిపోయేది. అతడెప్పుడెప్పుడు వస్తాడా అని ఆతృతగా ఎదురుచూసేది. ఇవి జీవితాంతం వదిలవరచుకోవాల్సిన మధురక్షణాలయ్యేవి. కానీ ఇప్పుడో, తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ఒక వృద్ధుడికి అప్పగించబడింది అనుకోగానే బావురుమని ఏడవాలనిపించింది. కానీ ఏడవడానిక్కూడా స్వతంత్రం లేని చోటు కావడాన మౌనంగా రోదించింది.

చీమ చిటుక్కుమంటే వినిపించే ఆ నిశ్శబ్దంలోంచి ''మహాప్రభువు విచ్చేస్తున్నారు, జయీభవ, విజయీభవ" అని పెద్దపెట్టున వినిపించడంతో గబుక్కున పడుకుని నిద్ర నటించింది మాధవి.

హర్యశ్వుడు మందిరంలోకి ప్రవేశించి తలుపు గడియవేసి వచ్చి "ఇదేం చిత్రం, అప్పుడే పడుకున్నావా? ఈ సుదినాన అసలు నిద్రేపోకూడదు'' అంటూ తట్టి లేపాడు.

మాధవి తన అయిష్టాన్ని నిద్రగా కప్పిపుచ్చుతూ కూర్చుంది. అతని దగ్గర్నుండి సురాపానం సేవించిన గుర్తుగా వికారం కలిగించే వాసన వస్తోంది.

రాజు తన కిరీటము, ఇతర ఆభరణాలను తీసి పక్కనున్న చెక్కపీటపై వుంచి మాధవిని గాఢంగా ఆలింగనం

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

చేసుకుని చుంబించాడు. అతనిపట్ల ఏమాత్రం ఇష్టమూ, మోహమూ లేనందున ఆమెలో ఎలాంటి స్పందనా కలగలేదు.

"అప్సరసలా వున్నావు మాధవీ, నిన్ను కన్న మీ అమ్మ గొప్ప అందకత్తె అయ్యుండాలి" అన్నాడు.

'అవును, అమ్మ చాలా బాగుండేదని అవ్వ ఎన్నోసార్లు చెప్పింది. అమ్మా, నన్నీ ప్రపంచంలోకి ఎందుకు తెచ్చావు? నీతోబాటు నన్నూ తీసికెళ్ళకూడదూ' అని మూలిగింది ఆమె మనసు.

మాధవి ముడుచుకుపోయి వుండటం చూసి "నేనంటే అయిష్టం కాదుగదా" అన్నాడు.

చెప్పే ధైర్యం లేక వూరుకుంది కానీ స్వేచ్ఛగా చెప్పగలిగితే "కంటికి కనపడని నలుసులో నూరోశాతం కూడా ఇష్టంలేదు, నన్ను వదిలి వెళ్ళు' అని చెప్పేది. ఆ అవకాశం లేనందున అతను అణువణువూ స్పృశిస్తూ శరీరాన్ని ఆక్రమించుకుంటూ వుంటే బొమ్మలా మౌనంగా వుండిపోయింది.

*** *** ***

తెల్లవారింది. గాలవుడు కనిపిస్తాడేమోనని ఎదురుచూసింది. అతని జాడే లేదు.

రాచమర్యాదల్లో ఏ లోపమూ లేదు. దాసీజనం అనేకమంది అనుక్షణం కనిపెట్టుకువుంటూ మాధవి అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా వున్నారు. అదంతా రాజుగారి ఆజ్ఞ. అందరిలోకీ కనకాంబరి మరింత ఆత్మీయత కనబరిచింది. ఆమెని అడగగా "గాలవులవారు నిన్న ఉదయమే వెళ్ళిపోయారమ్మా" అని చెప్పింది.

"నాకు చెప్పనే లేదే'' అని ఆశ్చర్యపోయింది మాధవి.

"బహుశా మళ్ళీ వస్తారనుకుంటానమ్మా" అంది కనకాంబరి.

మాధవి మరి రెట్టించలేదు. తన పెంపుడుతల్లి, చారునేత్రల ప్రేమాభిమానాల గురించి, తండ్రి, పినతల్లిల నిర్దయ గురించి చెప్పి మనసులో గూడుకట్టుకున్న బాధను కొంత తగ్గించుకుంది.

కనకాంబరి ఆమెని ఎంతగానో ఓదార్చి "ఒకరకంగా మీరెంతో అదృష్టవంతులు. ప్రభువుకు మీరంటే చెప్పనలవికానంత ప్రేమ కలిగింది. ఆయన ఇంత ఆత్మీయంగా వేరెవ్వరినీ చూడలేదు" అంది.

"ఇది ప్రేమ కాదు కనకాంబరీ, కేవలం వ్యామోహం" అంది మాధవి బాధగా.

"కావచ్చు, మీ మంచితనంతో అదే ప్రేమగా మారుతుందేమో చూద్దాం" అనేసి ఎవరో వస్తున్న అలికిడి కావడంతో అక్కణ్ణించి వెళ్ళిపోయింది కనకాంబరి.

వగలు రాత్రిగా, రాత్రి వగలుగా వరావర్తనం చెందుతూనే వుంది. రోజులు వారాలయ్యాయి. వారాలు నెలలుగా మారాయి. హర్యశ్వుడు ప్రతిరాత్రీ ఆమె చెంతకు వస్తున్నాడు.

"మహారాణిగారికి నీమీద తగని కోపంగా వుంది మాధవీ" అంది కనకాంబరి.

"జాలిపడాల్సిన నాపైన కోపమా? ఇంతకీ ఎందుకో"

"నువ్వు అంతఃపురంలో అడుగుపెట్టాక రాజుగారు ఒక్కరోజు కూడా రాణీగారి మందిరంలో అడుగుపెట్టలేదట"

"అందుకు నేనెలా బాధ్యురాలిని? ఆయన రాకుండా అడ్డుకోగల శక్తే వుంటే మొదటిరోజే ఆ పని చేసుండేదాన్ని. మహారాణి కోరుకున్నా రాజు అనుగ్రహించడంలేదు. నాకు ఆయన స్పర్శే గిట్టకపోయినా వదలడంలేదు స్త్రీకి తన శరీరంమీద కూడా తనకు హక్కుండదా కనకాంబరీ? " ఆర్ద్రంగా అడిగింది మాధవి.

"నువ్వలా బాధపడకు మాధవీ, స్నేహంకొద్దీ చెప్పాను కానీ, నిన్ను నొప్పించాలని కాదు"

"కొత్తగా ఈ క్షణం నువ్వు బాధపెట్టిందేమీ లేదు, నా తండ్రి నన్ను దానంచేసినప్పట్నుండీ దుఃఖం నన్ను దహిస్తూనే వుంది. ముక్కూమొహం తెలీని గాలవుడు నన్ను వెంటబెట్టుకురావడం, ఈ వృద్ధరాజుకు అప్పగించి వెళ్ళడం దారుణం కాదా నువ్వే చెప్పు?! నేను వరించబోయే రాజు మరెవ్వరినీ కోరుకోడని, ఏకపత్నీవ్రతుడయ్యుంటాడని అనేదాన్ని. ఇప్పుడు చూడు, ఈ రాజుకున్న అనేకమంది స్త్రీలలో నేనొకదాన్ని. దీన్ని నేను జీర్ణించుకోలేకపోతున్నాను కనకాంబరీ" అంటూ బాధగా కళ్ళు మూసుకుంది.

వాళ్ళలా స్వరం తగ్గించి మాట్లాడుకుంటూ మెల్లగా ఉద్యానవనంవైపు దారితీశారు.

ఉన్నట్టుండి మాధవికి కళ్ళు తిరిగినట్లయింది. రెండుచేతులూ కణతలకు



ఆనించుకుని, పడిపోకుండా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తోంటే "ఏమైంది మాధవీ?" కంగారుగా అడిగింది కనకాంబరి.

మాధవి బదులు చెప్పే స్థితిలో లేక పడబోతుంటే ఒడిసిపట్టుకుని రాతిఅరుగుమీద కూర్చోబెట్టి సఖులందరినీ కేకలేసి పిలిచింది కనకాంబరి.

చెలికత్తెలందరూ క్షణంలో మూగారు. వట్టివేళ్ళ విసనకర్రపై కర్పూరతైలం చిలకరించి వీచారు. పరుపు వేసిన నులకమంచం తెచ్చి మాధవిని దానిపై పడుకోబెట్టి అంతఃపురానికి మోసుకెళ్ళారు. కొద్దిసేపటికి మాధవి సేదతీరి కళ్ళు తెరిచిచూసింది. అప్పటికే రాజవైద్యుడు వచ్చి చేయి పట్టుకుని పరీక్షిస్తున్నాడు.

నెలసరిరోజుల గురించి వివరాలడిగి "కంగారుపడవలసిందేమీ లేదు, గర్భవతి" అని తేల్చిచెప్పి పండ్లరసాలు మొదలైన మంచి ఆహారం శ్రద్ధగా తీసుకోమని సలహా ఇచ్చి నవ్వుతూ వెళ్ళిపోయాడు వైద్యుడు.

సమాలోచనా మందిరంలో వున్న రాజు పరుగున వచ్చాడు.

"మాధవీ, నా సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. మహారాణీవల్ల ఇద్దరూ ఆడపిల్లలే, నువ్వు మగపిల్లవాడిని కని నా వంశాన్ని నిలబెడతావని నా నమ్మకం. దాన్ని వమ్ముచేయకు" అంటూ ఆమెని హృదయానికి హత్తుకున్నాడు.

"అది నా చేతిలో వుందా? ఎవరు పుట్టినా నేనేం చేయలేను కదా" బేలగా అంది మాధవి.

"ఇదిగో నా ఆనందాన్ని ఆవిరిచేయకు. నీ కడుపున యువరాజే పుట్టాలి, పుడతాడు. మరోమాట నేను ఊహించలేను, భరించలేను" అని రాజు అంటుంటే మాధవి కొయ్యబారినట్లు చూసింది.

ఇంకా వుంది.

ఒకవేళ మాధవికి మొగపిల్లాడే పుడితే ఆమెను పట్టమహిషిని చేసి హర్యశ్వుడు తన వద్దే ఉంచుకుంటాడా?

అలా చేస్తే మహారాణి ఊరుకుంటుందా?

ఒప్పందం ప్రకారం మాధవి ఒక సంవత్సరమే కదా ఉండేది...ఆ తరువాత ఆమె గతేంటి?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె శివలీల

ఇది కొ ఎడ్... మనల్ని గమనించే వారు చాలా మంది. కొంచెం గ్లామరస్‌గా ఉండాలి కదా...! ఈ ప్రాసెస్‌లో ఒక్కోసారి క్లాసుకు ఆలస్యమవడం...బస్ మిస్సవడం మామూలే...! దీన్ని నేను లైట్‌గానే తీసుకుంటా. కొంచెం మంచి ప్రొఫెసరయితే...నొ ప్రొబ్లెం... ఆలస్యమైనా ఎంటరైపోవచ్చు. హిట్లర్ లాంటి వాడైతే మాత్రం ... ఏం చేయాలో చదవండి.

ఆలస్యం....

సమయం 10గంటలు...
హిస్టరీ క్లాసు ప్రారంభమైంది
విద్యార్థులందరూ శ్రద్ధగా పాఠం వింటున్నారు
10గంటల 50 నిమిషాలు...
పదినిముషాల్లో క్లాసు ముగుస్తుంది
ఇంతలో...
టక్...టక్...టక్...

హైహీల్స్ శబ్దం లయబద్ధంగా వినిపిస్తోంది. క్రమంగా దగ్గరవుతోంది. వచ్చేదెవరో విద్యార్థులందరికీ అర్థమైపోయింది. వేగంగా నడిచొస్తున్న ఆ అమ్మాయి అదే వేగంతో క్లాసులోకి అడుగుపెట్టబోయింది. ప్రొఫెసర్‌ను చూసి గుమ్మంలోనే ఆగిపోయింది. ఇదేం గమనించనట్లు ఆయన పాఠం చెబుతూనే ఉన్నారు. విద్యార్థులంతా ఒక్క క్షణం ఆమె వైపు చూశారు. తిరిగి పాఠం వినడంలో లీనమయ్యారు. క్లాసులోకి ఎంటరవ్వడమా? వద్దా? అని ఆలోచిస్తూ అలాగే నిలబడిందా అమ్మాయి. కొద్దిసేపటికి.... 'ఎక్స్‌క్యూజ్‌మీ సర్' అని ఆ అమ్మాయి అడగడమూ... "వుయ్ విల్ మీట్ ఆన్ టుమారో"అంటూ ప్రొఫెసర్ క్లాసు ముగించడమూ ఒకేసారి జరిగాయి. ఛీ... అలారం మోగగానే లేవాల్సింది. కానీ ఏం చేయడం... అర్ధరాత్రి వరకూ చదివి ఆరు గంటలకే లేవాలంటే చిరాగ్గా అనిపిస్తుంది. వీళ్లంతా ఎలా లేస్తారో ఏంటో... అనుకుంటూ క్లాసులోకి అడుగుపెట్టిందా అమ్మాయి.

లేట్‌గా వస్తే ఎవరి పరిస్థితైనా ఇంతే కదా అనుకుంటున్నారా? కానీ వీరు మాత్రం క్లాసుకు ఆలస్యమయితే అంతగా ఫీలవ్వాలా ఏంటి? లైబ్రరీ, క్యాంటీను ఉందెందుకు? అంటున్నారు.

"నా స్టూడెంట్ లైఫ్ అంతా గర్ల్స్ హై స్కూల్లోనూ, విమెన్స్ కాలేజీలోనూ గడిచిపోయింది. అక్కడెలా ఉన్నా... ఎలా డ్రస్సప్ అయినా నో ప్రొబ్లం... ఎవరూ చూసేవారు, కామెంట్ చేసేవారు ఉండరు. పట్టించుకునే వారు అంతకన్నా ఉండరు. ఇది కొ ఎడ్... మనల్ని గమనించే వారు చాలా మంది. కొంచెం గ్లామరస్‌గా ఉండాలి కదా...! ఈ ప్రాసెస్‌లో ఒక్కోసారి క్లాసుకు ఆలస్యమవడం...బస్ మిస్సవడం మామూలే...! దీన్ని నేను లైట్‌గానే తీసుకుంటా. కొంచెం మంచి ప్రొఫెసరయితే...నొ ప్రొబ్లెం... ఆలస్యమైనా ఎంటరైపోవచ్చు. హిట్లర్ లాంటి వాడైతే మాత్రం లైబ్రరీకెళ్లడమే బెటర్" అంటోంది ధరణి

"నేను పిజీ స్టూడెంటును. ఇంకా చిన్నపిల్లాడిలా సార్లకు భయపడాలా? సొ సిల్లీ...! క్లాసుకు లేటైతే క్యాంటీన్లో టైం పాస్ చేస్తాను. కొద్దిసేపు అలా ఇలా తిరుగుతాను. నాలాంటి లేట్ కమ్మర్స్ దర్శనమిస్తారు. కాసేపు వారితో బాతాఖానీ వేస్తా. ఆలస్యమైనా...క్లాసులోకి ఎంటరవ్వచ్చు. దాని వల్ల క్లాస్ వినేవాళ్లకూ డిస్టబెన్స్ కదా. అందుకే నేను బయటే కాలక్షేపం చేస్తా" అంటున్నాడు హేమంత్

"థియరీ క్లాసులే కదాని ఆలస్యంగా వెళ్లామనుకోండి. ప్రాక్టికల్స్‌కు అనుమతించరు. అందుకే టైంకు క్లాసులో ఉండాల్సిందే. ఒకవేళ లేటైనా... క్లాసులోకి ఎంటరైపోవడమే. లెక్చరర్ ఏలాంటి మాటలన్నా....నో ప్రొబ్లం. నాకు క్లాసు వినడమే ముఖ్యం. ఆయన తిడతారని బయటే ఉండిపోతే పాఠం అర్థం కాదు కదా" అంటాడు శంకర్

ఫ్రెండ్స్! మీరూ మీ సమయంలో ఎక్కువ భాగం అలంకరించుకోవడానికే కేటాయిస్తున్నారా? కేటాయించడమేంటి మా ఆలస్యానికి కారణమదే. అన్నదే మీ సమాధానమా? అలంకరణ ముఖ్యమే...కానీ చదువుకునే వయస్సులో చదువుకే ప్రాముఖ్యతనివ్వాలిగా. ఆలస్యం అయితే లైబ్రరీ లోకెళ్లి చదువుకోవడం కొంతలో కొంత నయమే... కానీ బయటే తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారంటే విలువైన సమయాన్ని వృథా చేసుకోవడమే కదా? ఇలాంటి సమస్యలన్నింటికీ ఒక్కటే పరిష్కారం. అదే ఇన్‌టైంలో క్లాసులో ఉండడం.

❋

వేల్ పిక్చర్స్ నిర్మించిన 'సీతా కళ్యాణం, 'కృష్ణ లీలలు', 'శశిరేఖా పరిణయం' మొదలైన చిత్రాలకు పబ్లిసిటీలో సలహాలివ్వడంతో గూడవల్లి రామబ్రహ్మంకి సినిమా ప్రపంచంతో సాన్నిహిత్యమేర్పడింది. జాతిని మేల్కొలిపే చిత్రాలు తీయాలనే కాంక్ష అప్పుడే ఆయనలో రగిలింది.

పులగం చిన్నారాయణ

మాలపిల్ల

హరిజనులతో మాట్లాడ్డమే నేరంగా, ఘోరంగా భావించే కరడుగట్టిన ఛాందసవాద రోజులవి.....

తమ రచనలతో వర్ణవ్యవస్థను తూర్పారబట్టిన రచయితలనే తీవ్రవాదులుగా భావిస్తున్న సమయమది....

సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే ఒకతను దేశాన్ని ఉర్రూతలూగిస్తున్న హరిజనోద్యమాన్నే ఇతివృత్తంగా సినిమా తీశాడు. శ్రోత్రియ బ్రాహ్మణ యువకుడు ఒక మాలపిల్లను ప్రేమించడం ఆ సినిమా ప్రధాన కథాంశం. ఆ సినిమా టైటిల్ 'మాలపిల్ల'. ఆ దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం.

పౌరాణికాలకే పెద్ద పీట వేసే తెలుగు సినిమారంగంలో ఏటికి ఎదురీది మరీ వెండితెర సంఘసంస్కర్త గూడవల్లి రామబ్రహ్మం సృష్టించిన 'సంచలన' చిత్రమీ 'మాలపిల్ల'. నాటి బ్రాహ్మణ సమాజంలో భారీ అలజడిని రేకెత్తించిన ఈ సినిమా పూర్వాపరాల్లోకి వెళ్లేముందు దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం గురించి కొంచెం వివరంగా చెప్పుకుందాం.

కృష్ణాజిల్లా నందమూరుకు చెందిన గూడవల్లి రామబ్రహ్మం బి.ఏ చదువుని అర్థాంతరంగా ఆపేసి బెజవాడలో 'ఫ్రెండ్స్' అండ్ కో పేరిట స్టేషనరీ వ్యాపారం సాగించారు. ఆ వ్యాపారంలో గూడవల్లి భారీగా నష్టపోయాడు. అయినా ఆయనకు సముద్రాల రాఘవాచార్యులతో స్నేహం మిగిలింది. కొన్నాళ్లు 'స్వరాజ్య' పత్రికలో నాటి నాటక ప్రదర్శనల మీదా, నాటక సమాజాల మీద విమర్శలు రాసేవారు.

తర్వాత 'భరతముని బృందం' పేరిట నాటక సమాజాన్ని స్థాపించి బందరులో నిర్వహించిన ఆంధ్ర మహాసభలో 'మృచ్ఛకటిక' నాటకాన్ని ప్రదర్శించారు. ఆ నాటక సమాజం సరిగ్గా సాగలేదు. 1931లో మద్రాసులో వచ్చి 'సమదర్శిని' పత్రికలో

సహాయ సంపాదకుడుగా, సంపాదకుడుగా చేశారు. ఆ సమయంలోనే వేల్ పిక్చర్స్ నిర్మించిన 'సీతా కళ్యాణం, 'కృష్ణ లీలలు', 'శశిరేఖా పరిణయం' మొదలైన చిత్రాలకు పబ్లిసిటీలో సలహాలివ్వడంతో గూడవల్లికి సినిమా ప్రపంచంతో సాన్నిహిత్యమేర్పడింది. జాతిని మేల్కొపే చిత్రాలు తీయాలనే కాంక్ష అప్పుడే ఆయనలో రగిలింది.

హరిజనోద్యమం ఇతివృత్తంగా గుడిపాటి వెంకటాచలం 'మాలపిల్లలు' అనే కథ రాశారు. ఒక బ్రాహ్మణ యువకుడు ఓ మాల పిల్లను ప్రేమించి, పెళ్లి చేసుకోవడమీ కథలో ప్రధానాంశం. ఈ కథను సినిమాగా మలచాలనుకోవడం నిజంగా సాహసమే. సినిమా ప్రజోపయోగంగా ఉండాలని భావించే గూడవల్లి ఈ ఇతివృత్తాన్నే తన తొలి చిత్రానికి ఎంచుకొన్నారు.

అప్పటిదాకా గ్రాంధిక భాషలో సాగిన సినిమా రచన ఈ చిత్రంలో వ్యవహారిక భాషలో కొనసాగి కొత్త మలుపుకు దారితీసింది.

అప్పట్లో సినిమా పాటలు స్టేజీ నాటకాల బాణీలోనే ఉండేవి. కానీ లలిత సంగీత ఫక్కీలో భీమవరపు నరసింహారావు చేత రామబ్రహ్మం ట్యూన్స్ చేయించారు. అలాగే అంతవరకూ రాగమయంగా కొంత శాస్త్రీయంగా ఉండే సినిమా పాటల్లో జానపద రీతుల్ని ప్రవేశపెట్టి తెలుగు సినిమా సంగీతాన్ని ఓ మలుపు తిప్పిన సంగీత దర్శకుడిగా భీమవరపు నరసింహారావు ఎప్పటికీ గుర్తుండిపోతారు. సాంఘిక చిత్రాల్లో పాటలు పాపులర్ కావడమనేది 'మాలపిల్ల'తోనే మొదలైందంటారు. ఈ సినిమాలో మొత్తం 15 పాటలున్నాయి.

చిత్రంలోని పాటలకు కావ్యగౌరవం ఉండాలన్న ఆశయంతో రామబ్రహ్మం గారు, బసవరాజు అప్పారావు భావగీతాలనెన్నుకున్నారు.

❀

కథా సంగ్రహం

ఓ దేవాలయానికి ధర్మకర్తగా పని చేసే సుందర రామశాస్త్రి దేవాలయాల్లోకి హరిజనులు ప్రవేశించడానికి పూర్తి వ్యతిరేకి. ఆయన కొడుకు నాగరాజు, దళిత యువతి చెంపలతతో ప్రేమలో పడతాడు. తండ్రి పట్టుదల మధ్య నలిగిపోతూ, చివరకు తాను ప్రేమించిన చెంపలత, ఆమె చెల్లలు అనసూయలతో పారిపోతాడు. ఓ ప్రమాదం నుండి ఆయనను దళితులు కాపాడతారు. దాంతో మానవతా విలువలనర్థం చేసుకుంటాడు సుందరరామశాస్త్రి. తన పంతాన్ని మరిచి దేవాలయాల్లోకి దళితుల ప్రవేశానికనుమతినిస్తాడు. అయితే ఈ నిర్ణయం ఓ వర్గ ప్రజల ఆగ్రహానికి గురౌతుంది. చివరికి పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణుగుతుంది. తండ్రి అనుమతితో నాగరాజు చెంపలతను పెళ్లి చేసుకుంటారు.

విడుదల	:	25-9-1938
సినిమా నిడివి	:	175 నిమిషాలు
సాంకేతికాంశాలు	:	35 ఎం.ఎం. బ్లాక్ అండ్ వైట్
నిర్మాణ వ్యయం	:	లక్షా పదివేల రూపాయలు
నిర్మాణ సమయం	:	40 రోజులు
నిర్మాణ ప్రాంతాలు	:	మద్రాసులోని మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్ & కంబైన్ స్టూడియో

"శ్రోత్రీయ బ్రాహ్మణులకు ఈ సినిమా ఉచిత పాసులు" ఎందుకో వచ్చే వారం చదవండి.

రంగులు పులిమితే...



'B' తో వచ్చేదెవరో!



చిన్నారి చిత్రకారులు

ఎ.భరత్ కుమార్,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్.
చిట్యాల,
నేరడ.



షాజితా, హైమావతి,
5వ తరగతి,
రాహుల్ స్కూల్,
చీరాల.

21.8.05 కు సరైన సమాధానం రాసినవారు

ఎ.సాగర్ (5), శ్రీ సత్యసాయి మోడల్ స్కూల్, అనకాపల్లి. అనుముల్ల నవీన్ (7), మధు విద్యాలయం, వైరా. జి.సాయిభరత్‌రెడ్డి (7), మోదుకూరు. పి.కిరణ్‌కుమార్ (9), నవోదయ మోడల్ స్కూల్, పాలకొండ. కె.అశోక్‌తేజ (10), శాంతి టాలెంట్ హైస్కూల్, పత్తికొండ. కె.జ్యోతిర్మయి (8), జి.ప్ర.ప.బాలికోన్నత పాఠశాల, సింగరాయకొండ. దారవల్ భాస్కర్ (9), లాకావత్ సురేందర్ (10), శ్రీవాణి విద్యాలయం, జనగామ. దుస్సా అక్షయ్ కుమార్ (5), జనగామ. డి.హర్ష (4), అద్దంకి. ఆర్.తిర్మల్ నాయక్ (10), ఎఇపిటిడబ్ల్యుఆర్ స్కూల్, మన్ననూర్. పి.ఎల్.వి.రమణ (6), ఎస్‌కె.కరీంబాషా (6), బేతం శివ (6), డి.కాశీం (7), జడ్‌పిహెచ్ స్కూల్, త్రిపురాంతకం. డి.ప్రసన్నవంశీ (6), అద్దంకి. డి.శివశంకర్ (9), సుండిపెంట. ఎం.డి.మాలిక్ (9), జడ్‌పిహెచ్‌ఎస్, మూసాపేట్.గుమ్మడి రమ్య (6), రేపల్లె. టి.చింటూ, టి.శ్రీనివాస్, పి.సాయికిరణ్, టి.రమేష్ , కరీంనగర్. ఎన్.రుచికరెడ్డి ఇబ్రహీంపట్నం. వి.రాధిక (8), బిసిగర్ల్స్‌హాస్టల్, సూర్యాపేట. చిల్కాబత్తిని యల్లమంద (6), దార్ల జీవరత్నం (7), ఎస్‌సిహాస్టల్, త్రిపురాంతకం. ఎ.సంపత్‌కుమార్ (8), టేలర్ హైస్కూల్, నరసాపురం. ఎ.సాహిత్యలోహిత (4), పాలకొల్లు. బి.చక్రవర్తి (5), ఠాగూర్ విద్యాలయం, వి.స్టాలిన్ (6), ఎ.స్రవంతి (6), కె.లత (6), బి.భరత్, బి.లావణ్య (6), మధు విద్యాలయం, వైరా. బి.లలిత (8), జడ్‌పిఎస్ఎస్, రెబ్బవరం. రాళ్లబండి సాయికిరణ్ (4), శ్రీరాంపూర్‌కాలనీ. కోరాడ శ్రీనివాస మణికంఠ (8), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టెక్కలి. కె.మురళీకృష్ణ (9), బాలభారతి హైస్కూల్, సిర్పూర్. జె.ఆకాంక్ష (4), సెయింట్ ఆన్స్ హైస్కూల్, తార్నాక. ఎం.నారాయణ రాజు (6), సిఎహెచ్ స్కూల్, మాదుగుల. యుయు.బాబు నరేంద్రప్రసాద్ (8), టి.కె.సృజన కుమారి, ఆర్.రంజాన్ (10), బి.రవితేజ యాదవ్ (10), ఎం.షబ్బీర్ హుస్సేన్ (10), కె.విజయ్‌కుమార్ (10), యం.తిమ్మప్ప (10), ఎం.ప్రసాద్ (10), వి.మంజునాథ్ (10), యం.అనుదీప్ (10), యు.భీమలింగ (10), యం.అమ్రేష్ (10), యు.రాజు (10), కె.మాలిక్ భాష (10), యు.ఈరన్న (10), యు.యం.అనిల్ (10), జి.నాగేష్ (10), బి.శ్రీనివాసులు (10), యం.రమేష్ (10), యం.బాలాజీ (10), యు.యం.డి.నాసిర్ (10), యు.ఎస్.అనిల్ (10), టి.యం.డి.నాసిర్ (10), బి.నరసింహులు (10), జి.సునందపవన్ (10), శ్రీవేణు విద్యాలయం, ఎమ్మిగనూరు.

(బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి).

28.8.05 సమాధానం:
సి.పి.బ్రౌన్

వీరివీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో తెలుసా! అయితే వెంటనే కార్డు మీద రాసేసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: వీరి వీరి గుమ్మడి పండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

ఆ కొక్కెం ఏదబ్బా!



ఎన్ని వున్నాయి?



అట్టమీది కథ

ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు

ఈ పురుగులు... రైతు మిత్రులు

"కుక్కపిల్ల, సబ్బుబిళ్ల,అగ్గిపుల్ల దేన్నీ చూడకు హీనంగా..."అని ఇంకా చాలా లిస్టు మన మహాకవి శ్రీశ్రీ చెప్పాడు. ఈ వారం అట్టమీది కథ గురించి చెప్పుకునే ముందు ఆ కవిగారిలాగే "వానపాము, నత్తగుల్ల, సాలెపురుగు వీటినీ చూడకు హీనంగా..." అనికూడా అనుకోవాలి. పురుగులు అనంగానే ముఖం చిట్లించి అసహ్యమనిపించే ఫీలింగొకటి విసిరేస్తాం. కానీ ఈ సృష్టి పరిణామక్రమంలో, ఒకదానికొకటి అనుకూల సంబంధంతో, వ్యతిరేక సంబంధంతో ఏర్పడ్డాయి. కొన్ని ప్రాణులు ప్రాణాలు విడిస్తేనే మరికొన్ని ప్రాణాలతో ఉంటాయి. కొన్ని జీవించివుంటేనే ఇంకొన్ని జీవిస్తూ ఉంటాయి. ఈ విధంగా కొనసాగాలి కూడా...లేకపోతే మన జీవావరణమే అడ్రస్సు గల్లంతవుతుంది నాయనలారా! అందులో మనంచెప్పుకునే కొన్ని పురుగులు అలాంటివన్నమాట...ఏలాంటివో వాటి అవసరం ఏంటో తెలుసుకుందాం మరి!

పురుగులనగానే మనకు వెంటనే స్ఫురించేవి దోమ, ఈగ, బొద్దింక, పేను, నల్లి వంటివే. పశువులతో, పంట మొక్కలతో పరిచయం ఉన్నవారికి గోమారు మిడతలు, లద్దెపురుగులు, గొంగళి పురుగులు, రసం పీల్చే పేను పురుగులు, రకరకాల రంగు రెక్క దోమలు, పెంచు పురుగులు వంటివి గుర్తొస్తాయి. చిత్రలేఖనం, ఛాయాచిత్ర ఒరవడితో సంబంధం ఉన్నవారికి సీతాకోక చిలుకలు తలపుకొస్తాయి. అదేవిధంగా ఎక్కువమంది వాడే తేనె, పట్టువస్త్రాల గురించి తెలుసుకున్నప్పుడు కూడా పురుగుల గురించి ఆలోచిస్తారు. ఈ పురుగుల్లో ఉన్న వైవిధ్యత, విలక్షణమైన అలవాట్లు మరే ఇతర జంతువుల్లో లేదంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఇప్పటివరకు దాదాపు పది లక్షల రకాల పురుగులను మనవాళ్లు గుర్తించగలిగారు. ఇంకా గుర్తించాల్సినవి ఎన్నో. మన ఆహార సముపార్జనలో, నివాసం ఏర్పరచుకోవడంలో అనేక అవరోధాలు ఏర్పరస్తున్న బెడద పురుగులతో పాటు ప్రయోజనకర కీటకాలు ఎన్నో ఉన్నాయని దాదాపు



18వ శతాబ్దంలోనే గుర్తించారు. అయినా వీటిని పూర్తిగా వినియోగించుకోవడంలో వెనుకబడిపోయాం. వీటి ఆకారాలు, అలవాట్లు, వాటివల్ల జరిగే ప్రయోజనాలను గురించి తెలుసుకోగలిగినపుడే వీటిని మన ముఖ్య మిత్రులుగా అంగీకరించగలం.

ఒక ప్రజాకవి **"పురుగులమందే నీకు పెరుగన్నమాయెనా ...అన్నలారా"** అని గానం చేశాడు. వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయిన చిన్న, సన్నకారు రైతులనేకమంది ఆత్మహత్య కోసం తరచూ వాడుతోంది సస్యరక్షణా రసాయనమే (పురుగుల మందు)నని దాదాపు ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ఈ పురుగుమందులు రూపొందించటానికి కారణం దోమలు, పేలు, నల్లులు, ఈగల వల్ల మనుషులకు... మిడతలు, లద్దెపురుగులు వగైరాల వల్ల పంటలకు సమస్యగా మారిన అనేకరకాల పురుగులే. వేలరకాల రసాయన పురుగు మందులను గత 3-4 దశాబ్దాల కాలంలో రూపొందించారు. అయినా ప్రతి సంవత్సరం వరి, పత్తి, మిర్చి, వేరుశనగ, మినుము, కంది, టమోటా, వంగ, మామిడి, కొబ్బరి, చెరకు వంటి వాటిపై పురుగులు దాడిచేసి రైతుల్ని నష్టపరుస్తున్న విషయం విదితమే. అదేరకంగా దోమల వల్ల పాకే మలేరియా, డెంగ్యూ జ్వరాలు మనల్ని వెంటబడుతూనే ఉన్నాయి. ఎందుకనుకున్నారు చెప్పుకొండి చూద్దాం! మరేం లేదు దీనికి కారణం ఈ పురుగులు కూడా ఆ పురుగుమందులను వరమాన్నంలాగా ఆరగించుకుని తట్టుకునే శక్తిని సంతరించుకోవడమే. పైగా వీటి అవశేషాలు, ఆహారం ద్వారా మనుషుల శరీరాల్లోకి చేరి మన ఆరోగ్యాన్ని, వ్యాధి నిరోధక శక్తిని దిగజారుస్తున్నాయని తెలుస్తూనే ఉంది. అయినా టన్నుల కొద్ది డిడిటి, పెరాథియాన్, మలాథియాన్, నువాక్రాన్, డెమక్రాన్, థయాటడాన్, యికలక్స్, క్లోరిపైరిఫాస్, మిమిడాక్రోప్రిడ్, ఫిట్, బేగాన్; ఎల్లెత్రిన్ (దోమల రిపెలెంట్), సైపెర్‌మిత్రిన్; ఎసిటామెప్రెడ్, స్పైనోసిడ్...హమ్మయ్య లిస్టు అయిపోయింది... ఇటువంటి పాత, కొత్త రకాలను ఉత్పత్తి చేసుకుంటూనే ఉన్నాము: అవసరమైతే వందల కోట్ల రూపాయలు వెచ్చించి అమెరికా, ఐరోపాల నుండి దిగుమతి చేసుకుంటూనే ఉన్నాం. కాని పురుగుల దాడి ఇళ్లల్లో, పొలాల్లో పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. అందుకే వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణ సమతుల్యత, ఆరోగ్య సంరక్షణ, వనరుల పటిష్టతను ఇవ్వగల సమగ్ర విధానాన్ని అమలు చేసినపుడే సరైన సస్యరక్షణ చేయొచ్చని అనుభవం గలవాళ్లు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఈ సమగ్ర సస్యరక్షణా పద్ధతుల్లో కీలకమైన అంశంగా జీవ నియంత్రణ (బైలాజికల్ మేనేజిమెంట్) విధానాన్ని ప్రతిపాదించడం, అది ఎంత విలువైనదో గుర్తించడం జరిగింది. జీవ నియంత్రణలో ప్రముఖమైనవిగా 'మిత్ర జీవులను' పరిగణించారు.. మిత్రజీవుల్లో పురుగుల తెగకు సంబంధించినవి కొన్నయితే, సూక్ష్మజీవులు మరికొన్ని. పురుగులకు



దాయాదులైన సాలీళ్లు, తవిటెపురుగులు (మైట్స్) ఇతర ఉన్నతితరగతి జీవులైన పక్షులు, తొండలు, పాములు కొన్ని ఉన్నాయి ప్రయోజనకర పురుగులు (మిత్రకీటకాలు) వీటిలో అతి ముఖ్యమైనవి. వీటిని గురించి కొంత తెలుసుకుందాం.

· మిత్ర కీటకాలను పరాన్నజీవులు (పారాసిటాయిడ్స్) బదనికలు(ప్రిడేటర్స్)గా విభజించవచ్చు. తరచుగా మన పంట పొలాలను చుట్టుకుని ఉండే బెడద పురుగులను ఆశ్రయించే వీటి వివరాలు ఇదుగోండి... అవధరించండి మరి!

పరాన్న జీవులూ... బహుపరాక్

పరాన్నజీవులైన పురుగులు అతి సున్నితంగా ఉండడం కద్దు. అనగా అధిక వేడిని, అతి తేమను, ఘాటు విషాన్ని తట్టుకోలేవు. దాదాపు 15 రకాల పరాన్నజీవులైన పురుగులు, మన పంట పొలాల్లో సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఇవి ఏకజత రెక్క పురుగుల తరగతి, సన్నటి నడుం తరగతి, కందిరీగల జాతికి చెందినవే.

ట్రైకోగ్రమ్మాటిడ్స్ : పంట పొలాల్లో తరచుగా తిరిగే గుడ్డు దశ పరాన్నజీవిగా ప్రముఖమైనదిగా ప్రపంచవ్యాపితంగా గుర్తించారండి! తల్లిదశలో కేవలం 0.1 - 0.3 మిమీ పరిమాణంలో ఉంటాయి. ఇవి తమ ప్రత్యేక "గ్రుడ్ల అవయవం" ద్వారా అనేక గుడ్డు పురుగుల గుడ్డులోనికి తమ గుడ్లను చొప్పించి పెట్టగలవు. ఆ గుడ్ల నుంచి వచ్చే పిల్ల పురుగులు బెడదపురుగు గుడ్డులను పొదగనివ్వకుండా చూస్తాయి. తద్వారా అవి ప్రారంభ దశలోనే అణగారిపోతాయి. వివిధ రకాల ట్రైకోగ్రమ్మా కందిరీగలు కృత్రిమంగా వృద్ధిచెంది పొలాల్లో లక్షల సంఖ్యలో ఒకేసారి ఉపయోగపడుతున్నాయి. పత్తి కొబ్బరి వరి చెరకు వంటి ముఖ్య పంటలకు పట్టే పురుగులను వీటి ద్వారా అదుపు చేసే వీలుందని గుర్తించేశారు. అంతేనేటి మరి! ఆటి తరువాత ఇవిగో ఈ **సెవియోనిడ్ కందిరీగలు** కూడా అనేకరకాల బెడద పురుగులను గుడ్ల దశలోనే మటాష్‌చేసి పారేస్తాయి. సీలియో, టెలినోమస్ వంటి పరాన్నజీవులు వీటి అక్కచెల్లెళ్లే మరి! అవి కూడా ఒక్కొక్కటి 0.2 - 04 మిమీ, పరిమాణంలో నల్లటి శరీరంతో ఉంటాయి. తామాశ్రయించబోయే బెడదజీవిని వాహకంగా ఏ మోటారుబైక్‌లాగానో, టాటానువోలాగానో ఇవి ఉపయోగించగలవు. హల్లోహల్లో **యూలోఫిడ్ కందిరీగలు...**మీ గురించి కూడా చెబుతానుండండి మరి. వీటికి ప్రత్యేకమైన కాళ్లు, స్పర్శ వెంట్రుకలు ఉంటాయి. ఈ నిద్రదశ పరాన్నజీవులు వివిధ రకాల బెడదపురుగులపై చాలా ఈజీగా బతగ్గలవు. ట్రైకోస్పైలస్ అనే దాసరి పురుగు, ఆకుచుట్టపురుగు వంటి కీలక బెడదజీవులను అదుపులో ఉంచగలవు. టెట్రాక్టికస్ అనే పరాన్నజీవి వివిధ రకాల పురుగులను లార్వా, గుడ్డు, ప్యూపా దశల్లో అణచగలవు. ఇకపోతే **బ్రాకోనిడ్ కందిరీగలు** పటిష్టమైన శరీర నిర్మాణం కలిగి వైవిధ్యమైన రంగుల్లో ఉంటాయి. ఈ కందిరీగలు

కూడా చూడ్డానికి చిన్నవే. కానీ వీటి తాకిడికి ఎర్రగొంగళి పురుగు, కాండం తొలిచే పురుగులు, లద్దెపురుగులు, సీతాకోక చిలుక లార్వాలు, కాబేజీ, పుటెల్లా పురుగు వంటివి మటాష్! వీటిల్లో ఎక్కువవాటికి కవచంలో నిద్రదశ నడిపే అలవాటు ఉంటుంది. అందుకే నిమ్మను ఆశించే సీతాకోక చిలుక, లార్వా, ఎర్రగొంగళి పురుగు లార్వాల్ని ఈ తెల్లటి ప్యూపాల గుంపు చుట్టుకొనడం అంటే రౌండ్‌చేసి స్పాట్ పెడతాయన్నమాట. ఇలాంటివాటిని కృత్రిమంగా పెంచి, పొలాల్లో వదిలితే నా సావిరంగా...ఇగ చూస్కోండ్రీ... చీమల వలే నల్లరంగులో ఉండే **బెథైలిడ్ కందిరీగలు** కూడా ముఖ్యమైన పరాన్నజీవులే. ఇవి అనేక లద్దె పురుగులను, పెంచురెక్క జాతి పురుగులను అదుపు చేయగలవు. కొబ్బరి ఆకు పురుగును సమర్ధవంతంగా అణిచే గొనియోజెస్ ఈ కోవకు చెందినదే. దీన్ని కూడా కృత్రిమంగా వృద్ధిచేసి పొలాల్లో వదిలే వీలుంది.

ఇక వెనుక కాళ్లకు ముళ్లు వంటి భాగాలున్న **ఛాల్సిడ్ కందిరీగలు,** అతి చిన్న పరిమాణంలో ఉండి ఎక్కువ వేగంగా వృద్ధి చెంద గల **ఎన్‌సైర్టిడ్ కందిరీగలు,** చారల నడుముతో నల్లగానో, పొగాకు రంగులోనూ ఉండే ఈ పెద్దరెక్క **ఎలాస్మస్ కందిరీగలు,** పొడవాటి శరీరం, సన్నటి నడుం, సూది వలే పొడుచు కొచ్చే గుడ్ల అవయవముండే **యిక్నియోమిడ్ కందిరీగలు,** వరి, నువ్వు, మిర్చి, మామిడి వంటి ముఖ్య పంటలపై బెడదగా మారిన దోమజాతి మిడ్జి పురుగులను అదుపులో ఉంచగల **ప్లాటీగాస్టరిడ్ కందిరీగలు,** కంటికి కనబడీకనబడని పరిమాణంలో వివిధ రంగు శరీరాలతో ఉండే **ఎఫిలైనిడ్ కందిరీగలు,** వైవిధ్యమైన రంగు శరీరాల్లో వెడల్పాటి వీపుతో ఉంటే **ప్టెరోమాలిడ్స్ కందిరీగలు,** ఇంకా **డ్రైనిడ్ కందిరీగలు, టాక్నిడ్ ఈగలు, పైపక్యులిడ్ ఈగలు** లాంటి మంచి పురుగులుండటం వల్ల మనకెంతో మేలు.

బదనికలు మన బ్రదర్స్ అండ్ సిస్టర్స్‌లాంటివి

తమ ప్రత్యేకమైన అవయవ నిర్మాణంతో బెడద పురుగును వేటాడి చంపి వెంటనే తినగలిగేవే బదనిక పురుగులు. ఇవి తల్లి, పిల్ల పురుగు దశల్లో కూడా చాలా సందర్భాల్లో బదనికలగానే జీవితాన్ని గడపగలవు. ఇవి తమ జీవితకాలంలో అనేక పురుగులను చంపి తినగలవు. దాదాపు 18 రకాల బదనిక పురుగులను తరచుగా మన పంట పొలాల్లో గమనించే వీలుంది. వీటిలో కొన్నింటిని కృత్రిమంగా వృద్ధి చేసి పొలాల్లో విస్తరింపజేయవచ్చని





గుర్తించారు. మన జానపదులెప్పుడో వీటినెంతో గౌరవించారు. **"ఆడేటి పాడేటి తుమ్మెదా/ వాన జాడల్లు తెలిపేటి తుమ్మెదా... మగనాలి నాటింది తుమ్మెదా/ చేను తెగపండి ఒరగాలి తుమ్మెదా"** అని పాటలు కూడా కట్టారు. అలాంటి తూనీగల్లో పెద్దక్కయ్యలు ఈ **పెద్ద తూనీగలు.** దృఢమైన శరీర నిర్మాణంతో పొడవాటి తోక, ప్రత్యేకమైన రెక్కలు, భిన్నమైన తల కలిగిన తూనీగలు తరచుగా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఎగురుతూ కనిపిస్తాయి. వీటి పిల్ల పురుగులు నీళ్లలో బతకగలవు. ఇవి రెండు దశల్లో వివిధ రకాల దోమలను, మిడ్జి పురుగులను, గ్నాట్స్‌ని, ఈగలను, లద్దె పురుగులను పట్టుకుని తినగలవు. **చిన్న తూనీగలు** వైవిధ్యమైన రంగుల్లో ఉంటాయి. ఈ చిన్న తూనీగలు కూడా పెద్దవాటిలా వేగంగా దూర ప్రదేశాలకు సంచరించ లేకపోయినా, వరి, చెరకు, పత్తి, వేరుశనగ వంటి పైర్లను ఆశించే పురుగులను భూమిలో ఉన్నపుడు ఆశ్రయించి అదుపుచేస్తాయి. అంతేగాక దోమలను, గుర్రపు ఈగలనూ తినగలుగుతాయి. కెమిరియాన్ (ఊసరవెల్లి) లక్షణానికి చెందిన **పొడుగు మెడ మాంటెడ్ పురుగులు** పరిసరాలను బట్టి రంగును మార్చుకోగలవు. ఇవి పొడవాటి కాళ్లతో అతి వేగంగా దూకుతూ తమ ఆహారంగా అనేక రకాల పురుగులను పట్టి తినగలవు. మీసాల మామయ్యలు ఈ **మీసాల మిడతలు.** పొడవాటి స్పర్శ వెంట్రుకలతో నడుమును దాటి పెరిగే మందం రెక్కలతో పచ్చగా పొలాల్లో ఎగిరే మిడతలు కూడా ప్రయోజనకర జీవులేనంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఇవి తల్లి పిల్ల దశల్లో పేనుబంక, పొలుసు పురుగులను తినగలవు. వీటికి కత్తి ఆకారంలో ఉండే గుడ్ల అవయవం ఉంటుంది. తద్వారా ఆకు సందుల్లో గుడ్లను చొప్పించి పెట్టగలవు.

సినిమాల్లో రేడియో నాటికల్లో చీకటి పడింది అనడానికి గుర్తుగా ఒక రకమైన శబ్దం చేస్తారు. అదేనండీ...కీచురాయి గొంతు చేసే వింత సవ్వడి. వాటిని **గ్రిల్లిడ్ మిడతలు** అంటారులేండి! ఆ కీచురాళ్లు తమ మోకాలు భాగాన్ని శరీరానికి రుద్ది శబ్దం చేస్తాయి. ఇవి కూడా అరుదుగా ఇతర పురుగులను తింటూ బతగ్గలవు. ఇంకా **కొక్కెం తోక పురుగులు, ఎర్రచీమలు, కందిరీగలు,అక్షింత పురుగులు, కరాబిడ్ పెంకు పురుగులు, పులిమచ్చ పురుగులు, కవచపు రెక్క నల్లులు, ఎసాసిన్ నల్లులు, మిరిడ్‌నల్లులు, అల్లిక రెక్క పురుగులు, సిర్ఫిడ్ ఈగలు, దోపిడీ ఈగలు (ఎసిలిడ్ పురుగులు), మిడ్జి పురుగులు, పొలుసు రెక్క పురుగు జాతి బదనిక...**అబ్బో ఇలా చెప్పుకుంటూ పోతే లిస్టుకి అంతుండనన్ని పురుగులు మన చుట్టాలని తేలుతుంది.

ఇంతమంది చుట్టాలేమైపోతున్నారు...?!

ఇంట్లో, చెద పట్టిందని చెప్పి ఎన్నెన్నో మందులు పిచికారీ చేస్తాం. మన వల్ల కాకపోతే ఇప్పుడు పెస్ట్ కంట్రోలు సంస్థలొచ్చాయి కదా! వాళ్లు మన ఇంటిని స్వాధీనపరుచుకుని, వ్యామెగాముల్లా కవచధారులై పవర్‌ఫుల్ మందులు కొట్టి మూడురోజులో, ఐదురోజులో ఆ గదులను ప్యాక్‌చేసి ఆ తరువాత తెరుస్తారు. ఆ మందు ఘాటుకి మనక్కూడా ఓ పదిపదిహేను రోజులు కడుపులో తిప్పుతూ ఉంటుంది. అక్కడ చెద పూర్తిగా చచ్చిందో లేదో గానీ సాలీడు, బల్లి లాంటి సాధుజీవులు మాత్రం సోదిలో లేకుండాపోయాయి. ఇదే తీరులో పొలాల్లో వాడే అతి శక్తివంతమైన రసాయనిక మందుల ప్రభావానికి ఇలాంటివెన్నో జాతులకుజాతులు నశించిపోతున్నాయి. దానితో జీవవైవిధ్యం పోతోంది. ప్రకృతి సహజంగా వినాశకర క్రిమికీటకాలను నాశనం చేసి మనకు మేలుచేసే మనిషి చుట్టాలైన మేలుజాతి క్రిమికీటకాలు లేకుండా పోతున్నాయి. దీని వెనుక పురుగుమందులమ్ముకునే ప్రపంచ వ్యాపారుల సంతోషం కూడా లేకపోలేదు.

అందుకే...ఇప్పటికైనా మన చుట్టాలను కాపాడుకుందాం. రండి. మిగిలిన మిత్రజీవులైన సాలీళ్లు, తవిటి పురుగులు (మైట్స్) తొండలు, పక్షులు, కప్పలు, పాములు అదేవిధంగా పురుగులకు జబ్బులు కలిగించి వాటి ఉధృతిని సహజంగా అదుపు చేసే బ్యాక్టీరియా, బూజు, వైరస్, ప్రోటోజోవా, నులిపురుగులను కాపాడుకుందాం.

❀

సవరణ

గతవారం 28.8.05 "స్నేహ" సంచికలో "నిండుగా నాగార్జున సాగరం" అట్టమీది కథ రాసిన రచయిత కె.వి.గా పేరొందిన కె. వెంకటేశ్వర్లుగారు అని గమనించ వలెను పొరబాటుకి చింతిస్తున్నాం

ఆరోగ్యం

ఈగలతో బహుపరాక్...

డాక్టర్ టి. సేవకుమార్



మానవులకు అతి సన్నిహితంగా మెలిగే కీటకాలలో ఈగలు పేర్కొనదగినవి. ఈగలలోనూ చాలా జాతులున్నాయి. వీటిలో కొన్ని కుట్టేవి ఉన్నాయి. కొన్ని కుట్టనివి ఉన్నాయి. కుట్టే ఈగలు ఎన్నో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తికి దోహదపడుతున్నాయి. ప్రస్తుతం మనం ఇళ్ళలో చూస్తోన్న ఈగలు కుట్టేవి కావు. అయితే ఇవి వ్యాధికారక సూక్ష్మజీవులకు మెకానికల్ వెక్టార్స్‌గా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా అంటువ్యాధులు విజృంభిస్తున్నాయి. మనం రోజూ చూసే ఈగల్లో మస్కాడొమెస్టికా, మస్కావిసినియా, మస్కానెబులో, మస్కా సార్కెన్స్ జాతికి చెందిన ఈగలు పేర్కొనదగినవి. వీటిలో మస్కాడొమెస్టికాను సాధారణంగా కనిపించే ఈగగా పేర్కొనవచ్చును.

ఈగలు ముసురుతున్నాయంటే దాని అర్థాన్ని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. అక్షరజ్ఞానంతో సంబంధం లేకుండా అక్కడ అపరిశుభ్రత ఉందని ఎవరైనా కచ్చితంగా చెప్పవచ్చు. దీని ద్వారా ఈగలకు, మానవ నివాసాల పరిశుభ్రతకు గల అవినాభావ సంబంధం ఏమిటో చెప్పకనే చెబుతోంది.

ఈగ శరీరం తల, థోరాక్స్, అబ్డామెన్ అని మూడు భాగాలుగా విభజించబడి ఉంటుంది. వెంట్రుకలతో కూడిన కాళ్ళు, రెక్కలు ఉంటాయి. ఈగ జీవిత చక్రంలో నాలుగు దశలుంటాయి.

ఈగ ఆహారాన్ని ఎలా గ్రహిస్తుంది?

ఈగల ఆహారం ఆర్గానిక్ పదార్థాలు. ఈ పదార్థాల ఉనికిని ఈగలు వాసన ద్వారా గుర్తిస్తాయి. అయితే ఈగలు ఘన పదార్థాలను ప్రత్యక్షంగా స్వీకరించలేవు. స్వయంగా కొన్ని రకాల స్రావాలతో ఘన పదార్థాలను ద్రవ పదార్థాలుగా మార్చుకొని... వాటిని పీల్చడం ద్వారా గ్రహిస్తాయి. కళ్ళె, మలం, మానవ లేదా జంతువుల శరీరంలోని పుండ్లు, కుళ్ళుతోన్న చెత్త, ఆర్గానిక్ పదార్థాలు ఏవైనా ఈగల ఆహారమే. తీపి పదార్థాలకు చీమలు పట్టినట్లు, అపరిశుభ్రం అనిపించే ఆర్గానిక్ పదార్థాలకు ఈగలు వస్తాయి. ఆ పదార్థాలు సహజంగానే అనేక ప్రాణాంతక సూక్ష్మజీవులకు నిలయాలుగా ఉంటాయి. మామూలుగా కంటికి కనిపించని ఈ సూక్ష్మజీవులు శరీర భాగాలకు అంటుకుంటాయి. చూషణ ద్వారా జీర్ణాశయంలోకి ప్రవేశిస్తాయి. మానవ నిర్లక్ష్యం పుణ్యమా అని సమృద్ధిగా లభిస్తోన్న ఆహారాన్ని మితిమీరి పీకల దాకా మెక్కిన ఈగలు తరచూ వాంతులు చేసుకుంటాయి. వీటిలే వామిట్ డ్రాక్స్ అంటారు. అంతేగాక అదే విధంగా తరచూ మల విసర్జన చేస్తుంటాయి. ఈ మలం వామిట్ అంతా సూక్ష్మజీవులమయం.

ఈగలు రెస్ట్‌లెస్ ఇన్‌సెక్ట్స్. ఒక చోట ఇవి కుదురుగా ఉండవు. కాస్త వర్షం పడితే చాలు మనమే వాటికి పండుగ వాతావరణం కల్పిస్తాం. నాలుగు మైళ్ళ దాకా తిరిగే సామర్థ్యాన్ని వాటికి ప్రకృతి ప్రసాదించింది. తినడం, సంతతిని పెంచుకోవడం, తిరగడం తప్ప మరే ఇతర వ్యాపకాలను ప్రకృతి వాటికి ఇవ్వలేదు. ఈగలకు మంచి, చెడు విచక్షణ తెలియదు. అది వాటి తప్పు కాదు. ప్రకృతి ఆ విధంగా వాటిని సృష్టించింది. అందుకే ఈగలకు మన ఆహార పదార్థాలు, మల పదార్థాలకు భేధం తెలియదు. వాటికి రెండూ ఒకటే. కనుకనే ఈగలు మానవ పరిసరాల చుట్టూ విచ్చలవిడిగా తిరుగుతుంటాయి. అంటే ఎగురుతుంటాయి. మలం మీద వాలి వెంటనే ఆహార పదార్థాలపై వాలతాయి. ఫలితంగా సూక్ష్మ జీవులు శరీర భాగాలకు అంటుకోవడం ద్వారా రవాణా అవుతాయి. అందుకే ఈగలకు 'పోర్టర్స్ ఆఫ్ ఇన్‌ఫెక్షన్' అనే పేరు కూడా ఉంది. ఆహార పదార్థాలపైన, పాత్రలపైనా వాంతులు చేసుకుంటాయి. మల విసర్జన చేస్తాయి.

అంతా సూక్ష్మజీవుల మయం. అయితే అన్ని రకాల సూక్ష్మజీవులు మన శరీరంలోకి చేరినా అవన్నీ వ్యాధులను కలుగజేయలేవు. కొన్ని మాత్రమే వ్యాధులకు కారణమవుతున్నాయి. ఈ విధంగా ఈగలు సాధారణంగా టైఫాయిడ్, డయేరియా, గ్యాస్ట్రో ఎంటిరైటిస్, కలరా, బాసిల్లరీ డి సెంట్రా, రక్త విరేచనాలు, అమీబియాసిస్, పోలియో, లెప్టోస్పైరోసిస్, ఆంత్రాక్స్ మొదలైన వ్యాధులకు ఈగలు వాహకాలుగా పని చేస్తున్నాయి. ఫలితంగా అంటువ్యాధులు విజృంభిస్తున్నాయి. హెల్త్ ఎమర్జెన్సీకి దారి తీస్తున్నాయి. ఈగల అదుపుకు పారిశుధ్య పరిరక్షణే ముఖ్యం. ప్రజల్లో తగిన శాస్త్రీయ చైతన్యం రావాలి. ఈగల పట్ల జాగరూకత పెరగాలి.

కథ

జ్ఞానం అనే వృక్షానికి బీజం ప్రశ్న. మా వాడి చిక్కు ప్రశ్నలు ఒక్కోసారి నాకు చికాకు కలిగించినా...వీలైనంత వరకూ ఓపిగ్గా సమాధానాలిస్తూనే ఉంటాను. ఇంతకీ దేశంలో కొలువుదీరిన ఆ దిష్టి బొమ్మలెవరివి ?

ఎస్. హనుమంతరావు

దిష్టిబొమ్మల కొలువు

"ఏ నీ క్వశ్చన్?'' నవ్వుతూ కళ్లెగరేశాను.

"అటుచూడు నాన్నా. మనిషిలా ఉన్న ఆ బొమ్మేంటి?" కొత్తగా కడుతున్న ఇంటివైపు చూస్తూ అడిగాడు మావాడు.

ప్రశ్నార్థకాన్ని ఎవరో కవి కొడవలితో పోల్చారు! నిజంగానే ప్రశ్న చాలా సందర్భాలలో పీకలమీద కత్తే! అందునా పసివాళ్ల ప్రశ్నలు ఒక్కోసారి మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

ఇంట్లో ఉక్కబోతని భరించలేక పెరట్లో కుర్చీవేసుకుని పేపర్ చదువుకుంటున్న నా దగ్గరకి మా బాబు వచ్చాడు నెమ్మదిగా.

వాడి వాలకం చూస్తే... కచ్చితంగా ఏదో ప్రశ్న అడగడానికే వచ్చాడని అర్థమైంది.

జ్ఞానం అనే వృక్షానికి బీజం ప్రశ్న. మా వాడి చిక్కు ప్రశ్నలు ఒక్కోసారి నాకు చికాకు కలిగించినా...వీలైనంత వరకూ ఓపిగ్గా సమాధానాలిస్తూనే ఉంటాను.

ఐదవ తరగతి చదివే మా వాడు అందరిపిల్లల్లా బయటికెళ్లి తోటి పిల్లలతో ఆడటానికి ఇష్టపడడు. నేను కొన్న కామిక్ బుక్స్, పిల్లల పత్రికలు ముందేసుకుని చదువుతుంటాడు. మధ్య మధ్య సందేహాలతో నన్ను వేధిస్తాడు.

"ఆ బొమ్మెందుకంత అసహ్యంగా ఉంది?" చిరాగ్గా మొహం పెట్టి అడిగాడు మళ్లీ.

"ఓ అదా..?" దాన్ని దిష్టిబొమ్మంటారు అన్నాను.

తాటాకు కమ్మలుతో, ఎండుగడ్డితో చేసిన ఆ బొమ్మకి చిరిగిన ఖద్దరుచొక్కా తొడిగారు.

తలస్థానంలో ఓ కుండ బోర్లించారు. దానికి సున్నంతో కళ్లు, ముక్కు, నోరు ఆకృతులను దిద్దారు. అన్నింటికన్నా అసహ్యంగా రహస్యావయవాన్ని బహిరంగపరిచారు. జుగుప్సని వర్ణించడానికి చక్కగా సరిపడే పద చిత్రంలా ఉందా బొమ్మ!

"దిష్టి బొమ్మంటే ఏంటి నాన్నా? దాన్నెందుకు పెడతారక్కడ?'' ప్రశ్నల పరంపర ఇహ మొదలైంది.

''మరి...వాళ్లు కొత్తిల్లు కట్టుకుంటున్నారు కదా.. అందరిచూపులూ దాని మీదే ఉంటాయి. మనిషి చూపు మంచిది కాదని.. అది పడిన వస్తువు నాశనమవుతుందని చాలా మంది నమ్ముతారు. అందుకే నరుడి కంటికి నాపరాయి కూడా పగులుతుందని సామెత కూడా ఉంది. ఇది గుడ్డి నమ్మకమే అయినా మనలో చాలామంది దీన్ని నిజమనుకుంటారు. ఆ దిష్టి బొమ్మనక్కడ పెడితే అందరి దృష్టి ఇంటి మీద కాక, దానిమీద పడుతుందని, అంచేత కొత్తింటికి కీడుండదని అనుకుంటారు"

"అంటే ఎవరిల్లు కట్టుకున్నా దిష్టి బొమ్మ పెట్టకుండా ఉండరా నాన్నా"

''అవును'' అని పేపర్లోకి దృష్టిమళ్లించాను.

"నిన్న టీవీ వార్తలో మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశమని చెప్పారు కదా అంటే ఆ ఇల్లు లాగే ఇంకా పూర్తి కానిది కదా మన దేశం.... మరి ఇలాగే దిష్టి బొమ్మని దేశం మీద పెట్టాలి కదా?"

వాడికొచ్చిన ఆలోచనకి నాకు మతిపోయినంత పనైంది.

"ఒక్కటేం ఖర్మరా... మన దేశంలో చాలానే ఉన్నాయి దిష్టిబొమ్మలు"

కూలీల శ్రమ కంటే... ఆర్కిటెక్ట్ మేధస్సు కంటే... పైసాపైసా కూడబెట్టి ఇల్లుకట్టుకున్న వాడి డబ్బుకంటే... ఇసుక, ఇటుకలు సిమెంట్ లాంటి మెటీరియల్ కంటే... ఇంటి నిర్మాణంలో తనదే ప్రధాన పాత్రన్నట్లుగా నిలబడిందా దిష్టిబొమ్మ. ఇలాంటి బొమ్మల్లాగే దేశాభివృద్ధిలో తమ పాత్ర అంతంతమాత్రమే అయినా మొత్తం ప్రగతి, కీర్తి అంతా తమదేననే మరో రకం దిష్టిబొమ్మలు మనసులో మెదిలి చిరాకేసింది.

"ఎవరు నాన్నా ఆ దిష్టిబొమ్మలు?"

మా వాడు ఊరుకునే రకం కాదు కదా!

"కాస్తెదిగితే నువ్వే గుర్తుపట్టగలవురా" తేలిగ్గా అన్నా.

రెండ్రోజుల తర్వాత...

ఓ సాయంత్రం స్కూలు నించి వస్తూనే హుషారుగా అన్నాడు మావాడు ...

"నాన్నా! నేను పెద్దవ్వకుండానే తెలిసిపోయింది నువ్వన్న దిష్టిబొమ్మలెవరో!!!"

ఇంతలో ఎవరో మిత్రులు మా ఇంటికొచ్చారు. దాంతో ఆ సంభాషణక్కడితో ముగిసింది.

ఆ మరుసటి రోజు పేపర్లో చదివా. ఊళ్లో ఎవరివో దిష్టిబొమ్మలు తగులబెట్టారట. నిన్న సాయంత్రం మావాడి మాటలకర్థం దొరికింది. వాడికి తెలిసినంత తొందరగా అందరికీ తెలిస్తే ఎంత బావుణ్ను...!

❀

పప్పెట్ ఇంటర్వ్యూ

సింధు

'యమ' సంకటం

ఆదినం ఎంతగా ఎదురుచూసినా విక్రమార్కుని జాడలేదు. వారం బట్టి జమ్మిచెట్టు మీద పడున్న భేతాళుడు ఒళ్లు నొప్పులతో అసహనంగా కదులుతున్నాడు. 'ఒహో జ్వరాల సీజన్ కదా! బహుశా విక్రమార్కుడూ జ్వరపీడితుడై ఉంటాడు.' ఈ భావం భేతాళుడి మనసులో మెదలగానే 'ఈ ఒళ్లు నొప్పులు వదలాలంటే అలా కాలు కదపక తప్పదు' అనుకుంటూ బివి (భేతాళ్, విక్రమార్కు) టీవీ విలేకరి రూపంలో భూలోక సంచారం చేస్తూ హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌కు చేరాడు. అక్కడో బెంచీ మీద కూర్చున్న ఇద్దరు వ్యక్తులు బి.తాళ్ కంటపడ్డారు. వారు సాధారణ మానవాకృతిలో ఉన్నా వారి ముఖాల్లో మానవేతర తేజస్సు ఉట్టిపడుతోంది. "వీరినెక్కడో చూశానే..." అనుకుంటుండగానే "ఆ... గుర్తొచ్చారు. యమధర్మరాజు, చిత్రగుప్తుడు. ఏంటీ! వీళ్ళు భూలోకంలో...?" అనుమానిస్తూనే బి.తాళ్ వాళ్లను సమీపించాడు. యథాబుద్ధిన ఇంటర్వ్యూ ప్రారంభించాడు.

బి.తాళ్ : నమస్తే. ఎమ్. ధర్మరాజా (అనగానే ఇద్దరూ ఉలిక్కి పడి అప్పటి వరకూ తింటున్న కాలక్షేపం బఠాణీల పొట్లాన్ని జారవిడుచుకున్నారు.)

ధర్మరాజు : ఎవరది? మమ్మెలా గుర్తించితివి? "ఒహో... ఈ భూలోకంబున కూడా..." (అంటుండగానే)

బి.తాళ్ : ఆశ్చర్య పడకండి. నేనూ... మానవుణ్ణి కాను. గడువు కన్నా ముందే చనిపోయానని మీరు మీ యమలోక ప్రవేశాన్ని నిరాకరిస్తే విక్రమార్కుని రాజ్యంలో జమ్మిచెట్టుమీద పడున్న భేతాళుణ్ని... సారీ సమవర్తీ! (యమునికి మరో పేరు) నావల్ల మీ బఠాణీలు నేలపాలయ్యాయి. (అంటూనే..) ఏయ్? ఐస్ క్రీం. ఇలా రా..

ధర్మరాజు : ఏమిది భేతాళా! పేరు చిత్రముగా నున్నది.

బి.తాళ్ : మీరప్పుడు యమలీల చిత్రంలో భూలోకానికొచ్చినప్పుడు తిన్నారే... అదే హిమక్రీములు స్వామి.

ధర్మరాజు : ఓహో... నాకు బహు ఇష్టము. తెమ్ము తెమ్ము (చిత్రగుప్తుడు, యమధర్మరాజు ఐస్ క్రీంలు తింటూండగానే...)

బి.తాళ్ : స్వామీ! ఇంతకూ తమరి భూలోక సంచారానికి కారణం...

ధర్మరాజు : ఏమున్నది భేతాళా! గడువు తీరకుండానే నీలాగే యమపురికి చేరే కేసులు లెక్కకు మిక్కుటముగా మారాయి.... (పూర్తి కాకుండానే)

బి.తాళ్ : ఎందుకని స్వామి?

ధర్మరాజు : అదే మాకునూ అర్థం కాకున్నది. మొదట మహిళలే అలా చేరారు. ఈ విషయాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దృష్టికి తీసుకెళ్ళగా చిత్రగుప్తునితో ఏక సభ్య కమిషన్‌ను నియమించారు. అత్యాచారాలు, వరకట్నం కారణమనీ... ఇందుకు భూలోక కీచకాదులతోపాటు అత్తల ఆరళ్ళు, భర్తల హింసలు మూలమని తేలింది. భూలోకంలోనే నరకాన్ని చవిజూసిన అలాంటి మహిళలకు కాలం చెల్లడంతో నిమిత్తం లేకుండా యమపురి ప్రవేశమివ్వమనడంతో అప్పటికయ్యది పరిష్కారమైనది. భూలోకమునే వారందరూ నరకాన్ని చవి చూసినందున వారందరికీ స్వర్గధామ ప్రవేశం కల్పించాం.

బి.తాళ్ : మరిప్పుడొచ్చిన సమస్యేమిటి స్వామి?

ధర్మరాజు : ఒక్క మహిళలే కాదయ్యా... పురుషులు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు... ఇంకా చెప్పాలంటే... అదేనయ్యా.... ఆ... మూడోరకం వాళ్ళతో సహా మా 'కాలపాశం'తో నిమిత్తం లేకుండా యమపురికొచ్చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈశ్వరుని దృష్టికి తీసుకెళ్తే... 'దిగులు పడకు. కాటికాపరుల బదులు విద్యుత్ వాటికలు ఏర్పాటు చేశానని' అనడంతో ఈ పిచ్చి మా రాజుతో లాభం లేదని బ్రహ్మను ఆశ్రయించాను. ఆయన నన్నుమించిన సందిగ్ధంలో

ఉన్నాడు. పుట్టుక కూడా ఆయన ప్రమేయం ప్రకారం ఉండటం లేదని చెప్పాడు. అదేదో.... కుని.. అదేనయ్యా కుటుంబ నియంత్రణ పుణ్యమా అని బ్రహ్మ జీవం పోసినా డాక్టర్లు దాన్ని చిదిమేస్తున్నారంట... దాంతో కోపమొచ్చి ఆయన జీవం పోయడం మానేశాడు. అయినా అదేదో కొత్తగా... ఆ... క్లోనింగ్ ప్రక్రియతో పుట్టిస్తున్నారంట. చతుర్ముఖధారి అయిన ఆయనకు ఇవన్నీ సంపూర్ణంగా కనిపించినా వివరాలు అంతుపట్టలేదు. అందుకే వివరాలన్నీ సాకల్యంగా తెలుసుకునేందుకు చిత్రగుప్తుణ్ని నాకు జతచేసి ద్విసభ్య కమిషన్ వేశారయ్య.

బి.తాళ్ : ఇంతకూ ఏం తేల్చారు స్వామి... (ఆ మాటల్లో చెప్పలేనంత ఆతృత)

ధర్మరాజు : బ్రహ్మతో నిమిత్తంలేని పుట్టుకకు అపర బ్రహ్మలైన సైంటిస్టులు కారణమని తేలింది. వాళ్లు తయారు చేసిన వాహనాలే మాతో నిమిత్తం లేని మృత్యువును ప్రసాదిస్తున్నాయని గుర్తించాం. ట్రాఫిక్ జామ్‌లు, మోటార్లను చెడగొట్టడంతో వీటిని నియంత్రించొచ్చని యోచిస్తే...

బి.తాళ్ : వీలు కాలేదా స్వామి?

ధర్మరాజు : అది సాధ్యమేనయ్యా! కాని తమంతట తాము ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళూ, ఆకలిచావుల బారిన పడే వాళ్ళూ, రోగపీడిత మృతులూ ఉన్నారు. వాళ్ళనేం చేయాలో తెలియడం లేదు.

బి.తాళ్ : అందుక్కారణం తెలిసిందా స్వామి?

ధర్మరాజు : అది అంతుపట్టకేనయ్యా! కాలక్షేపం బఠాణీలు కొనుక్కుని ఈ బల్ల మీద కూలబడ్డాం. అదృశ్య, అభూత, మానవాతీత విన్యాసాలేవో వీటిని నియంత్రిస్తున్నట్లు గోచరమౌతోంది. అవి కనిపించుట లేదు.... వినిపించుట లేదు.

బి.తాళ్ : మరేం సిఫార్సు చేస్తారు సార్.

ధర్మరాజు : ఏముంది? చావు పుట్టుకల్లో ఈశ్వర, బ్రహ్మ ప్రమేయం అదుపు తప్పింది. ఇందుకు పాలనా విధానాల్లోనే ఎక్కడో లోపముందనిపిస్తోందయ్యా. అందుకే. ఒకసారి వైకుంఠానికెళ్లి శ్రీ మహావిష్ణువును కలుద్దామని యోచిస్తున్నాం.

బి.తాళ్ : ఆయనేం చెప్తారు స్వామి? ఆయన పాలనకూ కాలం చెల్లి ఏళ్ళూపూళ్ళూ గడిచాయి.

ధర్మరాజు : అంతేనంటావా భేతాళా? మరీసమస్యకు పరిష్కారమేమంటావు?

బి.తాళ్ : బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చుట్టూ నువ్వెన్ని ప్రదక్షిణాలు చేసినా నీకేమీ అర్థం కాదు యమధర్మారాజా! పుట్టుక, పాలనా, కాలధర్మం వంటి విషయాలు ఇప్పుడు వాళ్ళ చేతుల్లో లేవు.

ధర్మరాజు : మరెవరి చేతుల్లో ఉన్నాయి భేతాళా?

బి.తాళ్ : అది అర్థం కావాలంటే ఇప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డినీ, గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుణ్ని కలవాలి.

ధర్మరాజు : మరా అవకాశం సాధ్యమంటావా భేతాళా.

బి.తాళ్ : నేనున్నాగా! పదండి ధర్మరాజా. వచ్చేవారంలోపే కలిసి వివరాలు సేకరిద్దాం. ❀

తెంగ్లీష్

"వానా... వానా... వెల్లువాయె"

రెయినో... రెయినో... ఫ్లడ్డాయె

డా॥ జె.పి. వైద్య

నల్లమబ్బులు సింగారించుకొని హడావుడిగా కదిలిపోతున్నాయి. తెల్ల మబ్బులు బేల మోహంతో మూలకు నక్కాయి. నీటి చుక్కలు 'రపీ...' మంటూ ఆకాశం నుండి వేగంగా రాలుతూ... మోహాన్ని ప్రేమతోనే... అయితే కాస్తంత 'ఘాటు ప్రేమ'తో ఉతుకుతున్నాయి.

చూస్తుండగానే... 'నీటి చుక్కలు' కుంభవృష్టిగా రూపు దిద్దుకున్నాయి.

బస్టాండ్‌లో ప్రజలు 'గుట్టకొకడూ-పుట్టకొకడు'లా కాకుండా కన్పించిన 'షెల్టర్' కిందకు పారిపోవటం మొదలెట్టారు. కొందరు 'పాన్ షాప్ రేల'లో అవసరం ఉన్నా లేకున్నా 'వక్కపొట్లాలు' కొనడం తప్పనిసరై మబ్బుల్ని తిట్టుకుంటే... మరి కొందరు 'పర్వాలేదు- తంతే పల్లీ వాలా 'అడ్డా'లో పడ్డాం...'అనుకొని 'పల్లీ'లు తింటూ, తమదృష్టాన్ని బేరీజు వేసుకోసాగారు.

నక్కను తొక్కొస్తే అదృష్టవంతుడంటారు.... మరి, ఇంకాదేన్ని తొక్కి వస్తే దురదృష్టవంతుడంటారో అర్థంకాని మామూలు మనుష్యులు లబోదిబో మంటూ లొందలూ, గుంతలూ, అందులో నీళ్లునిండి తయారైన చిన్న తటాకాలను దాటేస్తూ, దారులు వెతుక్కోవడం ప్రారంభించారు....

"చేతిలో సూట్‌కేస్‌తో.... అందులోనూ ఒక్క డ్రస్‌తో హాయిగా బరువూ బాధ్యతలు లేకుండా ప్రయాణం చేసి తరించిపోదాంలే" అని కలలు కన్న 'టీ షర్ట్' గారు అనవసరంగా సెకండ్ హ్యాండ్ పుస్తకాలో డజను నింపుకొని - ఆ 'బరువు'ను తిట్టుకోసాగారు....

"ధూ! నీ యవ్వ! గింత బరువై చంపుతదని అన్కోలే... సెకండ్ హ్యాండ్ పుస్తకాలు గద... చేతులు మారినై... జర్రంత హల్కా కామంటే...! ఇంకా ఎక్కి బర్రై మునినయి... ఇప్పుడీ బర్వంత మోసుకొని యాడికని ఉర్కాలే.... పోనీ... తడ్వద్దను కొని, నెత్తిమీద పెట్కుంటే- సూట్ కేసుకు చిల్లులు మున్గినై గద.... లోపట్ల పుస్తకాలు తడిసి పోతై.... దరిద్రం వాన...! ఇప్పుడే జోపాల్నా...? ఇగ.. మందిగూడ మస్తై పోయింద్రు.. జాగగూడ కన్పడ్తలేదు... ఏం చేయ్యాలె?" అని బరువున్న సూట్ కేసును చేతులు మార్చుకుంటూ ఇబ్బందిగా కదులుతున్న 'టీషర్ట్' గారిని 'మోకాలు' దాకా తడిచిన 'జీన్ ప్యాంట్' గారు పలకరించారు....

'హాయ్....!

"ఏందీ ! హాయా ? ఏం హాయి ? నా బొంద...! మీదికెల్లి దరిద్రం వాన ఉతుకుతున్నదీ....! క్రింది లొందలల్ల నీళ్లు మునిగినై.... యాడ 'హోలు'న్నదో... యాడ 'మ్యాన్‌హోలు'న్నదో తెలుస్తలేదు.... సూట్ కేస్ బరువుగున్నది. కింద



పెడ్దామంటే జాగాల్లేకుంట కంపు 'గటర్ నీళ్లు' పారుతున్నై... కాళ్లల్లకెల్లి చెప్పులు జారి పోకుంట నేను చస్తుంటే 'హాయి' అంటవేందయ్యా? ఆఁ! దిమాగున్నదా ? మల్ల చూస్తే మా కొత్తోడి తీరున్నవ్...? జోకా...?" అని కోపంగా తిట్టుడు షురు చేశిన్రు 'టీషర్ట్' గారు.

మోకాలు దాకా తడ్సిన 'జీన్ ప్యాంట్' గారు సుతారంగా నవ్విన్రు....

"...... అవర్ ఆంగర్ అవర్ ఎనిమీ.... ! రేనీ సీజన్.... నో... రేనింగ్ రేనింగ్ కామన్ సీయింగ్...! వై అన్‌నెసెసరీ యాంగ్రీ సర్! మైండ్ కూల్...! దెన్ వర్క్ కూల్ ! యుసీ.... ! ఇన్‌ది బాటమ్ వాటర్ కూల్... వాటర్ వాటర్ ఎవ్రీ వేర్... చప్పుల్స్ ఎంటర్‌డ్ వాటర్... స్పీడ్ వాటర్... మై చప్పుల్స్ హాయిగా గాన్ ఇన్ ది వాటర్....ఇ... ! నాట్ యాంగ్రీ...! ఆఫ్టరాల్ చప్పుల్స్.... ! గాన్...! గానైతే గానీయండి...! యూ డోంట్ వర్రీ...! లైఫ్ ఈజ్ ప్రెషియస్...! నో ? ఇఫ్ లివ్... బలుసాకు ఈటింగ్..." అని అనునయించ సాగాడు....

వర్షం నీళ్లు తల నుంచి జారి చెవుల్లో కితకితలు పెట్టాయి. భుజం మీదుగా, వీపు నుంచి శరీరంలోని 'లోతట్టు' భాగాలల్లో కంపరం ఎత్తిస్తున్నప్పుడు, చలి జ్వరం వచ్చినట్టు ఒక్క 'ఝట్కా' తిన్నడు 'టీషర్ట్' వారు...

కింద 'బూట్లు'న్న వాళ్లు, చెప్పులు కొట్టుకొని పోతున్న వాళ్లు హడావిడిగా కదులుతున్నారు. ఆ దృశ్యాన్ని 'చిద్విలాసంగా' చూస్తూ నిలబడ్డ 'జీన్స్ ప్యాంట్' వాడి 'ఖిచిడీ ఇంగ్లీష్'ను విని... ఇంకా ఒళ్లుమండింది.

'బతికితే బలుసాకు తినొచ్చు' అన్న చిన్నముక్కనెంత భయంకరంగా... హారిబుల్‌గా చెప్తున్నాడు దరిద్రుడు! అని మనస్సులో అనుకోబోయి, గట్టిగా అనేసాడు.... 'హారిబుల్...! అని.

'యా...య్యా! ఈటింగ్ బలుసాకు ఈజ్ రియల్లీ హారిబుల్ ! యూసీ... ! నో టేస్ట్ ! బట్ ! డోంట్ వర్రీ యూ సర్! గుడ్ హోటల్స్ నియర్ నియర్...! ఐ నో మెనీ ! సూట్‌కేస్ బర్వు బర్వు...? హెవ్వీ హెవ్వీ...! ఇక్వారీ... కమ్ ! లెట్ యూ ఫీల్ కంఫర్టెబుల్... ! కమ్ సార్... కమ్ ! డోన్ట్ వరీ ! హాట్ హాట్ టీ ఇన్ ది రెన్... గుడ్‌ఫర్ హెల్త్" అని బలవంతంగా సూట్‌కేస్ పట్టుకొని, పెద్ద పెద్ద అంగలతో స్పీడుగా పరిగెత్తుతున్న 'జీన్‌ప్యాంట్'ను గతిలేక 'ఫాలో' చేయసాగారు 'టీషర్ట్' గారు....

'ఓర్నీ యవ్వ ! పిల్వని పేరటం తీరొచ్చి, సూట్‌కేసందుకొని ఉర్కుతున్నడు...! అదీ లాంగ్ లాంగ్ జంపుల్తో! దొంగైతే కాదు గదా....' అనుకుంటూ!

దూరంగా రేడియో పాడుతున్నది... వానా... వానా... వెల్లువాయె అని !

❀

ఓ ఊరి కథ

ప్రపంచ దృష్టినాకర్షించిన బిలం

పిడుగు సుబ్బరాయుడు

ఇదేదో సంస్కృత పదమని ఆలోచిస్తున్నారా? ఇదో ఊరిపేరు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆ గ్రామాన్ని నేడు బెలుంగా పిలుస్తున్నారు. కర్నూలు జిల్లాలోని కొలిమిగుండ్ల మండలంలోని ఆ గ్రామం ప్రపంచ దృష్టినాకర్షిస్తోంది. 1884కు ముందు ఆ గ్రామం పేరు బిలం. అనంతరం అదే గ్రామం బెలుంగా మారింది. కారణమేంటో తెలుసా? విదేశీయులు ఆ గ్రామాన్ని సందర్శించి గొప్ప బిలాలు ఆ ప్రాంతంలో ఉన్నట్లు కనుగొనడం! అనంతరం వాటిపై పలు పరిశోధనలు చేశారు. అచ్చమైన తెలుగు అర్థాన్నిచ్చే బిలం ఇంగ్లీషువాళ్ల నోళ్లలో నాని బెలుంగా మారిందని చరిత్ర చెబుతోంది. నేడు బెలుం గ్రామమున్న ప్రాంతంలో పూర్వం తాగునీరు దొరికేదే కాదనీ, అంతదాకా వస్తే ఆ చుట్టుపక్కల ఆమడ దూరం వరకూ గ్రామాలే ఉండేవి కావనీ ఆ ప్రాంత వృద్ధుల కథనం. కారణమేంటబ్బా అని ఆరా తీస్తే పలు విషయాలు వెలుగు చూశాయి. కనుచూపు మేరలో నీటిచుక్క కనిపించని పరిస్థితుల్లో ఒక కుక్క నీటి జాడను కనుగొందట. జాడ కనుగొనడమంటే మనుషులను తీసుకెళ్లి పరిశోధన చేసిందని కాదు. తాగునీటికి కటకటమనే పరిస్థితుల్లో ఒక కుక్క నీళ్లలో దొర్లి గ్రామంలోకి వెళ్లిందట. నీటికోసం ఇంత ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో కుక్కకు నీరెలా దొరికిందని ఆ గ్రామస్థులు దాన్ని వెంటబెట్టుకుని నీటి ఆచూకిని వెతికారట. అది ఒక గుహలాంటి ఆకారంలో ఉండే రంధ్రంలోకి దిగిందట. కాసేపు నీటిలో దొర్లి బయటికొచ్చిందట. దాంతో వాళ్లూ కిందికి దిగి లోనికి చూశారట. అక్కడ నీటి మడుగుందట. వెంటనే ఆ గ్రామస్తులంతా ఆ బావిలాంటి గుహచుట్టూ ఇళ్లు నిర్మించుకున్నారట. అప్పట్లో ఆ గుహను 'బిలం' అని పిలిచారట. దీంతో ఆ గ్రామం పేరూ 'బిలం'గా మారిందట.

ఈ ఊరు చివర, శివాలయం పక్కన నిటారు దారులు కలిగిన రాతి బావి దర్శనమిస్తుంది. అది దిగుడు బావి. ఒకవైపు మెట్లుంటాయి. నిజానికది బావికాదు. నిటారు బిలం. అంటే... గుహ. వర్షాకాలంలో దీనిలోని నీరు నిండి, పొర్లుతుంది. వేసవిలో ఇంకిపోతుంది. అయినా సొరంగం అడుగుభాగంలో నీరుంటుంది. ఇదే బెలుం గ్రామస్తులకు ప్రధాన నీటివనరు. ప్రస్తుతం పది మోటార్లు పెట్టి తోడినా నీటి కొరత రావడం లేదు.

గ్రామ మునసబు బి. మల్లారెడ్డి 1946లో ఈ బావి చిత్రపటం గీసినట్లు చరిత్ర చెబుతోంది.

ఇదీ బిలం 'బెలుం'గా మారిన కథ. ఇక్కణ్నుంచీ మొదలైంది అసలు కథ. 1884లో హెచ్.బి. ఫూటె అనే ఇంగ్లీషు దేశస్తుడి ఆధ్వర్యంలో ఆండ్రే ఎబిలే, నికోలే బులియర్, క్లాడ్ చాబెర్ట్, గిజెలా రోతఫ్ట్, సిబైల్లె ఊల్ఫ్ గ్రామ్ అనే సభ్యులు గల జర్మనీ బృందం కర్నూలు జిల్లాలో ఏరియల్ సర్వే చేస్తూ భూమిలో గుహలున్నట్లు కనుగొన్నది. లోపలికి దిగి కొంతవరకూ కొలిచారు. దానిని రికార్డుల్లోనూ ఎక్కించారు. అనంతరం సుమారు వంద సంవత్సరాల వరకూ ఈ విషయంపై పరిశోధనలు చేసిన వారుగానీ, దీన్ని పట్టించుకున్న వారుగానీ తక్కువే అని చెప్పొచ్చు.



తిరిగి 1982లో జర్మనీకి చెందిన గుహాన్వేషకుడు హెచ్‌డి గేబర్ కర్నూలు జిల్లా బనగానపల్లెలోని గెస్ట్‌హౌస్‌లో మకాం వేసి గుహలకోసం అన్వేషణ ప్రారంభించారు. కొంతకాలానికి ముఖ్యమైన అధికారులు బనగానపల్లెకు రావడంతో గెస్ట్‌హౌస్ వారినుంచి ఖాళీ చేయించాల్సొచ్చింది. అప్పట్లో బిలం గ్రామానికి చెందిన డియస్పీ చలపతిరెడ్డి, హెడ్మాస్టర్ రామసుబ్బారెడ్డి వారిని గుర్తించి తమ గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని గుహల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రారంభమైన పరిశోధనలో వారు 3225 మీటర్ల సొరంగాలను కనుగొన్నారు. ఒక చిత్రపటాన్ని కూడా రూపొందించారు. ఆ గుహల్లో మకాం వేసిన కొందరు సాధువులను అక్కణ్నుంచి ఖాళీ చేయించారు. అనంతరం పరిశోధకులు జర్మనీ కెళ్లిపోయారు. క్రమంగా విదేశాలనుంచి పర్యాటకులు ఆ గుహలను సందర్శించడం మొదలుపెట్టారు. అప్పటికే బిలంగా ఉన్న ఆ గ్రామానికి అతి దగ్గర్లోని గుహలను ఆంగ్లేయులు బెలుం కేవ్స్‌గా పిలిచారు. దీంతో క్రమంగా ఆ గ్రామం పేరు 'బెలుం'గా మారిపోయింది.

<u>1964 నుంచీ చూస్తున్నా.. జర్మనీ వాళ్లకు అప్పట్లో తోడుగా వెళ్లి గుహల్లో దిగి చూపించా...</u>

"నేను 1964నుంచీ ఈ గెవులను చూచ్చానే ఉండానప్పా. వాటిల్లో కొంతమంది సాదులుండేటోల్లు. వాల్లే అక్కడికొచ్చే వాల్లకు వాట్ని చూపించి రూకో అద్దగో తీసుకుని బతికేటోల్లు. అసుమంటి సమయంలో మా ఊరి రెడ్లు చలపతి రెడ్డి, రామసుబ్బారెడ్డి బనగానపల్లెనుంచి ఇంగ్లీసోల్లను తొడుకొనొచ్చి నన్ను వారికి తోడుసేసి గెవులను సూపించాలని సెప్పినారు. గేబర్‌తోపాటు డేనియల్, హబ్లే అనే ముగ్గురొచ్చినారు. శానా రోజులు అక్కడుండి గెవుల లోపలికి దిగినారు. నేను ముందుండి సూపిచ్చినా" అంటూ బెలుం గ్రామానికి చెందిన పత్రా వెంకట్రమణ చెప్పాడు. గుహల వెలికి తీతకు ఆయనే ప్రత్యక్ష సాక్షి.

అవీ... ఇవీ

మెంటల్ డాక్టర్

పిచ్చాసుపత్రిలో ఓ పిచ్చాడు వాష్ బేసిన్‌లో చేపల గాలం వేసి కూర్చున్నాడు. అటుగా వెళ్తున్న డాక్టర్ అది గమనించాడు.

"ఏమోయ్ ఏం చేస్తున్నావక్కడ ?" అని అడిగాడు డాక్టర్.

"కనిపించడం లేదా ? చేపలు పడుతున్నా" అన్జెప్పాడు పిచ్చాడు. డాక్టర్ నవ్వుకుంటూ వెళ్ళిపోయి అరగంట తరువాత తిరిగొచ్చాడు

'ఇప్పటిదాకా ఎన్ని చేపలు పడ్డాయి" అడిగాడు డాక్టర్ .

దానికి పిచ్చాడు " పిచ్చోడా ఎక్కడైనా వాష్ బేసిన్‌లో చేపలు పడతాయా " అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు



గంజి కేంద్రాల... ట్రాష్

అన్నపూర్ణ ఆంధ్రరాష్ట్రం
అన్నమో రామచంద్రా
అంటే అరెస్టులే శరణ్యం
ముపొద్దుల వరన్నం
పరమాన్నంగా ప్రజలు మొక్కుతుంటే
పేదరికం-ఆకలి!
కరువు- దుర్భిక్షమని
కట్టు కథలూ గిట్టని ప్రచారాలా...
పనికి ఆహార పథకం ఉండగా
కరువు జిల్లాల్లో గంజి కేంద్రాలా
ఇది చాలా చెడ్డ రాజకీయం
సుపరిపాలనల దిశగా
రాష్ట్రం రయ్యిన ఉరుకుతుంటే
ప్రజా సంక్షేమమే ఊపిరిగా
పగలు రాత్రీ నాయకులు
పని చేసి చూపిస్తుంటే
గంజి నీళ్ళ కేంద్రాలట...ట్రాష్!
రంగు రంగుల ఫ్యాన్సీ కార్లు
కనులకింపుగా తిరుగుతుంటే
గుడ్‌విల్‌తో కొత్త కాలనీలు
కదురమ్యంగా వెలుస్తుంటే
తిన్నదరగ క జనం తీరు తీరున చస్తుంటే
పాలకుల చిత్తశుద్ధిపై అభాండాలా
అన్నార్తులను ఆదుకుంటామని
గంజి కేంద్రాలా....
సరళీకరణం సంస్కరణలతో
రాష్ట్రం సంక్రాంతిలా వెలిగిపోతుంటే
ప్రపంచీకరణం ఆర్థిక విధానాలతో
స్వేచ్ఛా వాణిజ్యం విస్తరిస్తుంటే
పెట్టుబడులూ ఎగుమతులూ
అభివృద్ధే అభివృద్ధి !
వలసలూ చావులా
అంతా ట్రాష్ !
నిజం మటాష్

- అనిశెట్టి రజిత

విలువ లేని సామాన్యుల ప్రాణం

అమెరికాలో అయినా ఆఫ్రికాలో ఐనా బస్సులు, రైళ్లలో ప్రయాణించేది సామాన్యులే. విమానాలు ఎక్కేది అసామాన్యులు. ఇరువురిలో ప్రాణం ఒక్కటే. అయినా వాటి విలువలు వేరు. అమెరికాలో రోజూ ప్రయాణించేవారిలో ఇరవైలక్షల మంది విమానాలెక్కితే 320లక్షల మంది బస్సులు, రైళ్లు ఎక్కుతారు. సెప్టెంబరు 11 దాడుల తరువాత విమాన ప్రయాణీకుల భద్రతకు 181 కోట్ల డాలర్లు ఖర్చు చేశారు. బస్సు, రైలు ప్రయాణీకుల నిమిత్తం కేవలం రెండున్నర కోట్ల డాలర్లే అంటే నమ్మశక్యంగా లేదు కదూ ! 32మిలియన్ల మందిని తోడేళ్ల దయాదాక్షిణ్యాలకు వదలటాన్ని సహించరాదని, బస్సు, రైలు ప్రయాణీకుల సంఘ నాయకులు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. అందుకే సామాన్యుల ప్రాణాల విలువ తక్కువ అని చెప్పటం.

- ఎంకెఆర్



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

గ్రహాంతరవాసులు ఎలా ఉంటారు?

గ్రహాంతరవాసులు మనుషుల్లా ఉంటారా? జంతువుల్లా ఉంటారా? స్టీవెన్ స్పీల్‌బెర్గ్ సినిమాల్లో చూపించినట్లు చిన్న కాళ్లు, చేతులు, పెద్ద తల, విశాలమైన కళ్లతో జ్ఞానుల్లా ప్రకాశిస్తుంటారా? లేక మరికొన్ని సినిమాల్లో కనిపించినట్లు భయంకరాకారాల్లో ఉంటారా? గ్రహాంతర వాసులగురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఎదురయ్యే ప్రశ్న ఇదే. మనం ఎలా ఊహించుకున్నా కూడా మనకు గ్రహాంతర వాసులు ఎదో ఒక రూపంలో కనిపిస్తారు. ఆ రూపాలు మనం ఇంతకు ముందు చూసిన రూపాలతో పోలి ఉంటాయి, లేకుంటే మనం చూసిన రూపాల రూపాంతరీకరణ రూపంలో ఉంటాయి. కాని గ్రహాంతర వాసులు మనం ఊహించని, ఊహించలేని ఇంకో రూపంలో ఉండొచ్చుకదా అంటున్నారు శాస్త్రవేత్తలు. కళ్లు, తల, చేతులు, కాళ్లు, చెవులు వంటి శరీర భాగాలను విస్మరించి మనం రూపాన్ని ఊహించలేం. పోనీ గ్రహాంతర వాసులు మొక్కలమాదిరిగా ఉంటారనుకుంటే అదైనా మనం చూసిన మొక్కలూ, చెట్లకు మించిన ఆలోచన మనకు రాదుగాక రాదు, ఎందుకంటే మానవుని ఆలోచనలకు మూలం కనిపించే భౌతిక ప్రపంచమే కనుక.

నిజానికి ఆధునిక మానవునికి అత్యంత ఆసక్తి కరమైన విషయాల్లో గ్రహాంతర వాసం ఒకటి. గ్రహాంతర వాసులగురించి మానవుని ఆలోచనలు ఈనాటివి కావు. మానవ నాగరికత ఆవిర్భావం నుండి ఉన్నాయనేందుకు మన పురాణాల్లో, ప్రాచీన చరిత్రలో అనేక ఆధారాలున్నాయి. మనుషులను పోలిన దేవుళ్లూ, దేవతలూ పై లోకాల్లో ఉండేవారని మన ప్రాచీనులు నమ్మేవారు. ఆకాశంలో కనిపించే గ్రహాలు, నక్షత్రాలకు కూడా మానవుని రూపాలు తగిలించారు. ఆ విధంగా మన 'అష్టదిక్పాలకులు', సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు అంతాకూడా మనుషుల ప్రతిరూపాలే. సూర్యుడు ఏడు గుర్రాల తేరుమీద స్వారీచేసుకుంటూ భూమి పైకి వస్తే పగలు, మళ్లీ కిందికి పోతే రాత్రి. రుతుచక్రాన్ని నడిపించేదికూడా ఆకాశంలో విహరించే దేవతలే. వరుణుడు, వాయువు, అగ్ని, సముద్రుడు, నదులు, చివరికి భూమి కూడా నాటి మానవులకు తమ స్వంత ప్రతిరూపాలే. భూమి బల్లపరుపుగా ఉన్నదని నమ్మే రోజులవి. ప్రకృతి అంతా మనుషుల మాదిరిగానే కనిపించే వారికి గ్రహాంతర వాసులు కూడా అచ్చం మానవుల్లా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. అయితే అచ్చం మానవుల మాదిరిగా ఉండే ఆనాటి గ్రహాంతర వాసులు వారి దృష్టిలో అతీత శక్తులున్న దేవతలు, దేవుళ్లు.

కాని సైన్సు అభివృద్ధి చెందినాక బల్ల పరుపు భూమి తన గుండ్రని అసలు రూపంలో మానవుని ముందు ఆవిష్కరించబడింది. టెలిస్కోపు పెట్టి ఆకాశంలోకి చూసిన ఆధునిక మానవునికి గ్రహాలన్నీ భూమి మాదిరిగానే కనిపించాయి. దాంతో మనిషి ఊహించిన గ్రహాంతర వాసులకు ఇదివరకటి అతీత శక్తులు పోయాయి. ఇప్పుడు ఆధునిక మానవుల దృష్టిలో అందునా శాస్త్రవేత్తల దృష్టిలో గ్రహాంతర వాసులు మానవుల మాదిరిగానే ప్రకృతినుండి అభివృద్ధి చెందిన జీవులు. కాకపోతే వారు మానవునికన్నా ఎక్కువ తెలివితేటలు కలిగి ఉండవచ్చు లేకుంటే కొన్ని చోట్ల అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉండవచ్చు.

విశేషమేమిటంటే, విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతున్న కొద్దీ గ్రహాంతరవాసులు మానవులకు దూరం అయిపోతున్నారు. గ్రహాలను పరిశోధించి వాటి నిగ్గుతేల్చే క్రమంలో ఖగోళ శాస్త్రవేత్తలు కూడా మన సమీప గ్రహాల్లో జీవులు నివసించేవని నమ్మేవారు. దీనికి సంబంధించిన సైన్స్ ఫిక్షన్ కథలు కోకొల్లలుగా వచ్చాయి. భూమిమీద మాదిరిగానే వాతావరణ పరిస్థితులు కనిపించిన శుక్రగ్రహం, అంగారక గ్రహాలపై మానవుల మాదిరి జీవులు నివసిస్తున్నాయని చాలా కాలం నమ్మారు. చంద్రుని మీద కూడా మనుషులు ఉండే ఉంటారనుకున్నారు. శుక్రగ్రహం మీద వాతావరణం చాలా దట్టంగా ఉంటుందని ఖగోళ పరిశోధనల్లో తేలింది. దాంతో కొందరు అక్కడ వాతావరణం చాలా వేడిగా ఉంటుంది, దట్టమైన అడవులు ఉంటాయి.



భూమి తొలిదశలో ఉండే వాతావరణం అక్కడుంటుంది అన్నారు. తరువాత అంగారక గ్రహాన్ని పరిశోధించిన శాస్త్రవేత్తలు అక్కడ ధృవం నుండి గ్రహమధ్యరేఖకు నల్లటి చారికలు వెళుతున్నట్లు టెలిస్కోపుల్లో చూశారు. ధూళి దుమ్ము తుపానులు వీచే అంగారక గ్రహం మీద ధృవాల వద్ద మాత్రమే నీరు గడ్డకట్టి ఉంది, అక్కడి నుండి నీటిని ఇరత ప్రాంతాలకు తీసుకుపోయి వ్యవసాయం చేసేందుకు కాలువలు తవ్వారు, ఆ కాలువలేల చారికల ఆకృతిలో కనిపిస్తున్నాయి అని చాలామంది చెప్పారు. దీని ఆధారంగా సైన్స్ ఫిక్షన్ కథలు చాలా వచ్చాయి. కాని రానురాను ఆధునిక పరిశోధనల్లో ఇవన్నీ నిరాధారమైన నమ్మకాలని తేలిపోయింది. మానవుడు పంపించిన అంతరిక్ష వాహనాలు సూర్యకుటుంబంలోని దాదాపు అన్ని గ్రహాల వద్దకు వెళ్లాయి. గ్రహాల చందమామలను కూడా పరిశోధించాయి. కొన్ని వాహనాలు గ్రహాల మీద దిగాయి కూడా. ఇవన్నీ చెప్పేదేమంటే మన సౌరకుటుంబంలో జీవం ఉండడానికి ఒక్క భూమి మినహా మరే గ్రహమూ, ఉపగ్రహమూ అనుకూలంగా లేదు అని.

అయినా అంగారక గ్రహంలో మంచు ఉందని, ఆ మంచులో ఎక్కడో ప్రాథమిక స్థాయిలోనైనా జీవజాలం ఉండిఉంటుందని కొందరు నమ్ముతూనే ఉన్నారు. గురు గ్రహానికి చెందిన తొలి నాలుగు ఉపగ్రహాలైన ఇయో, యూరోపా, గనిమెడె, కాల్లిస్టోలను పరిశోధించిన శాస్త్రవేత్తల్లో కొందరు యూరోపా ఉపగ్రహం ఉన్న తీరుగాని, దాని వాతావరణ పరిస్థితులు గాని అక్కడ జీవం అభివద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తోందని చెబుతున్నారు. ఇక ఇంతకుమించి మన సౌరకుటుంబంలో జీవజాలం ఉనికికి అవకాశం లేదని తేలిపోయాక ఇప్పుడు అందరి దృష్టి మనకు దగ్గరలోని నక్షత్రాలమీదికి వెళ్లింది. మన సౌరకుటుంబం 'సూర్యుడు' అనే చిన్న నక్షత్రం చుట్టూ అల్లుకుని ఉన్న ఒక పదార్థ వ్యవస్థ. ఇటువంటి నక్షత్రాలు కొన్ని కోట్లు కలిపితే ఒక గెలాక్సీ అవుతుంది. మన సౌరకుటుంబం ఉన్న గెలాక్సీని 'పాలపుంత' గెలాక్సీ అంటున్నారు. ఇటువంటి కొన్ని కోటానుకోట్ల గెలాక్సీలు కలిస్తే ఈ విశ్వం. కనుక విశ్వంలోని ఇన్ని కోటానుకోట్ల నక్షత్రాల్లో మన సౌరకుటుంబ వ్యవస్థలవంటి పదార్థ సంఘటనలు అనేకం ఉండవచ్చు. అక్కడ భూమిమాదిరిగానే పదార్థం నుండి జీవి అభివృద్ధిచెంది పరిణామం చెందే అవకాశాలు ఉండవచ్చు. నిజానికి మనకన్నా కూడా మేధోజ్ఞానం బాగా ఎక్కువగా ఉన్న జీవులే అభివృద్ధి చెంది ఉండవచ్చు. మనం గ్రహాంతర వాసుల గురించి వెదుకుతున్నట్లే వారు కూడా మనల్ని గురించి వెదుకుతుండవచ్చు. ఇదీ ఇప్పుడు శాస్త్ర ప్రపంచం బలంగా నమ్ముతున్న విషయం. అయితే రుజువయ్యేవరకు ఇది నమ్మకమే గాని నిజం మాత్రం కాదు. ఈ ఊహను నిజం చేసేందుకు గాను అమెరికా ఖగోళ శాస్త్రవేత్తలు ఇతర గ్రహవాసులు పంపే రేడియోధార్మిక సందేశాలను పట్టుకోడానికి యాంటెన్నాలు, ఇతర ఏర్పాట్లు చేశారు. కాని నిజంగా అటువంటి సంకేతాలు వస్తే వాటిని మనం గుర్తించగలమా, నిజంగా గ్రహాంతరవాసులే భూమిమీద దిగితే వారిని మనం గుర్తుపట్టగలమా అనేది సమస్య. ఎందుకంటే గ్రహాంతర వాసులు మనం ఊహించిన, లేక మనకు కనిపించే ఏ రూపంలోనూ ఉండకపోవచ్చు.

కెంపు గుండె

తాడిత, పీడిత, బడుగు వర్గాల కోసం.... వారి శారీరక, మానసిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, సామాజిక, సంక్షోభ భరిత జీవన సంక్షేమం కోసం తపన పడే విలువైన 'కెంపు'ల్లాంటి గుండెలున్న వాళ్ళకోసమే ఈ పుస్తకమంటారు శ్రీ షంషేర్ అహ్మద్ గారు.

ఆధునిక మానవుని హృదయానికి తగిలిన గాయాలను గేయాలుగా రాసిన కవి శ్రీశ్రీ అన్నట్లు 'కుక్కల వలె, నక్కల వలె, సందులలో పందుల వలె, పెత్తందారీ ఇనుప పాదాలకింద నల్లుల వలె'.... తరాల తరబడీ... అణచివేతలో నలిగి రక్తసిక్తమైన కెంపువర్ణ ఎర్రగుండెలు చూడాలీ పుస్తకం. ఎందుకంటే...

బండరాళ్ళు కొట్టేటోళ్లు / ఎండలోన ఎండేటోళ్లు / ఎంగిలాకులు నాకేటోళ్లు / ఒళ్ళమ్ముకు బతికేటోళ్లు / సబ్సిడీ రూకలన్నీ దళారుల ధారాదత్తం చేసి మనిషి స్వార్థాన్ని నిలదీస్తారు. 'జ్ఞానం' అనే పదానికి ముందు 'వి'ని చేర్చితే, మనిషి ప్రగతి 'పథం'లో, 'అ' చేర్చితే అథ:పతనమేనని హెచ్చరిస్తారు. 'ముళ్ల పొదల దారిలో పల్లేరులను ఏరేసి / గులాబీలు కాకున్న మానె/ గులకరాళ్లయినా పరిచే పథికుడేడి ప్రపంచాన' అని ప్రశ్నిస్తాడు 'పథికుడు' అనే కవితలో.

పూట కూటి కోసం పరితపించే పాటక జనానికి... గారాల రాగాలు బోయే / గాజు బొమ్మల బోలు బూజు బొమ్మల కథలొద్దు / మతాల మంటల నెగదోసి / కులాల కార్చిచ్చు రగిల్చి / ప్రజాస్వామ్య పాకాన్ని బహు పసందుగా పండించి / పదవీ పాయసకుండ / పది తరాలపైన వదలకుండ / పదిలంగ ఉంచు 'కొన్న' వైనాన్ని, ప్రజారాబందుల నైజాన్ని

కెంపు గుండె
వెల : 75/-
పేజీలు : 135
ప్రతులకు : జయంతి పబ్లికేషన్స్.
దిల్‌సుఖ్‌నగర్,
హైదరాబాద్-60

ప్రపంచానికి చాటి / నెత్తురు మండించే శక్తులు నిండిన నవయుగ వైతాళిక రూపాలైన క్రాంతి కవితలు కావాలంటారు.

ధన వికటాట్టహాసాలతో విర్రవీగుతున్న ధరణిలో సామాన్యునికి దేవుడు, చట్టం రెండూ రక్షణివ్వలేవని 'ఆశ్చర్యం' అనే కవిత స్పష్టం చేస్తోంది.

దేశకాలమాన పరిస్థితులకద్దం పట్టే కవి ఒక్కోసారి 'క్రాంతి దర్శి' కూడా కావాలి. అజ్ఞానాంధకారంలో లుకలుకలాడే జనతకు వెలుగుబాట చూపాలి. కనుకే... 'కాలానికో విన్నపం'లో 'మందిర్-మస్‌జిద్ పీడకలల లావా ఘనీభవించి, రాం, రహీంలొక్కటై సాగే వేళ / చరిత్ర కొలిమిలో బతుకుచితిని మళ్లీ రగిలించకు / భరత సోదరుల మధ్య పగల సెగల నెగళ్ల నెగదోయకు తల్లీ! ప్రేమార్ద్రతల మైత్రిని క్షి(చి)తి చేయకు మళ్లీ' అని అవేదనగా విన్నవిస్తున్నాడు.

చిత్తూరు జిల్లా రచయితల సంఘాధ్యక్షులు శ్రీ కట్టమంచి బాల కృష్ణారెడ్డిగారు సెలవిచ్చినట్లు.... సృజన ఎంత ముఖ్యమో... ఆవిష్కరణా అంతే ముఖ్యమని అంటారు. మూడు శతాబ్దాలుగా రాస్తున్న వందలాది కవితలను సాహితీసమావేశాలకు, కవిసమ్మేళనాలకు, క్యాసెట్లకు, ఆలిండియా రేడియో.... "ఏర్" కే పరిమితం చేసి గాలికే వదిలేసినా.... ఇప్పటికైనా పుస్తక ప్రచురణతో కవిగా ప్రజల్లోకి వెళుతున్న షంషేర్ అహ్మద్ "ప్రజాకవి"గా ప్రఖ్యాతి పొందాలి.

- ఎం. ఆర్. అరుణకుమారి

ఉగాది కవుల వేలిముద్ర...

"రెప్పల చాటున/ ఎంత దాచిపెట్టినా/ నిదర కోడిపిల్లను/ బొమ్మల పెట్టె తన్నుకుపోతూనే ఉంది/ మూతపడని రెప్పల కింద ఇవిగో...నా ఉగాది కలలు!" కోసూరి రవికుమార్ లాంటి కవుల కనురెప్పల కింది ఉగాది కలలను కవితలుగా ప్రవహింపజేసింది సాహితీ స్రవంతి. విజయవాడ గుంటూరులలో సాహితీ స్రవంతి నిర్వహించిన ఉగాది కవితా సమ్మేళనంలో చదివిన కవితలను "వెక్కిరించిన వేలిముద్ర"గా పుస్తకరూపంలో తెచ్చారు. ప్రగతిశీల సాహితీవేదికలు కూడా ఉగాదిరోజు కవితాసమ్మేళనాలు నిర్వహించాలా అని సందేహించారు. కానీ ఆ రోజున కవులు ముఖ్యంగా యువకవులు తాము రాసిన కవితలకు ఎక్కడ వేదిక లభిస్తుందా అని చాలా ఆసక్తిగా ఉంటారు. ఔత్సాహిక కవులే కాదు అంతో ఇంతో రాస్తున్నవారు నుంచి బాగా రాసే కవుల వరకూ అందరికీ ఇలాంటివి కొన్ని సందర్భాలుగా ఏర్పడ్డాయి. ఆ సందర్భానికి తగ్గట్టుగా సాహితీ స్రవంతి కూడా నిర్వహించడంతో కవుల వ్యక్తీకరణ ప్రపంచ పరిస్థితులకు ఎలా అద్దం పట్టిందో ఈ సంకలనాన్ని చూస్తే తెలుస్తుంది. ఇందులోని కవితలన్నీ గత నెల ఉగాదిరోజున ఆ మర్నాడు విజయవాడ, గుంటూరులలో నిర్వహించిన కవితాగోష్ఠులలో కవుల స్వీయకవితాపఠనంలో వినిపించినవే. కొన్ని కవితలు అతి సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ వారి అభివ్యక్తి కూడా పరిగణనలోకి తీసుకోదగ్గ సామాజిక వాస్తవికత ఉట్టిపడింది. అడిగోపుల వెంకటరత్నం, జి విజయలక్ష్మి, షేక్ కరీముల్లా, అరసవిల్లి కృష్ణ, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, కోసూరి రవికుమార్ లాంటి ఒకింత కవిత్వమధురిమలు పలికించగలవారి కవితా వేలిముద్రలు కూడా ఇందులో ఉన్నాయి. "సప్తస్వరాల్లో అపశృతి/ కోకిల ఎండినగొంతులో వినిపిస్తూంది"(అడిగోపుల) "చీకటి ముసురుల తెరల్లో/ కమ్చీకి వేలాడే కాల్చిన కబాబులమై/ పొలిటికల్ పాయ్‌ఖానా ముందు/ వేలాడుతూనే వున్నాం"(కరీంముల్లా) "రావిచెట్టు కింద/ నులకమంచంలో సేదతీరిన శ్రమసంతకం/ గోనెసంచితో సమాంతరరేఖల బండి/ ఎక్కుతున్న కరవుకాలం"(అరసవిల్లి కృష్ణ) "కొడుకులెందుకు/ దహనకాండను ఖండాంతర 'సి.డి.'లో దర్శించడానికా..."(సోమేపల్లి) "మరలో ఏ గింజైనా పిండైనట్లు/ ఇంటిల్లిపాదికీ ఆడది హైటెక్ మరలా మారాలి/ పిండిమరకి సెలవురోజుంది/ ఆడమర సెలవురోజయినా గ్రైండర్‌లా తిరుగుతూనే ఉండాలి"(జి విజయలక్ష్మి) ఇలాంటి కవితాపాదాలు చదువుతుంటే ఉగాది కవితల గొంతు ఎంతో పదునుగా మరెంతో అదనుగా ఉన్నాయనిపిస్తుంది. "ఉగాది కవిత రాద్దామని" లాంటి కవితల్లోని శుద్ధ వచనాన్ని కవిత్వీకరణ అయ్యేటట్లు చెప్పి తిరిగి రాయించడమో, ప్రచురించే మిత్రులే కవి అనుమతితో అభివృద్ధి చేసి అచ్చువేయడమో చేస్తే బాగుండేది. అట్టమీది బొమ్మ ఎంత ఆకర్షణీయంగా ఉందో "వెక్కిరించిన వేలిముద్ర" అనే పేరు కూడా ఆకర్షిస్తుంది.

- శంకర్



వెక్కిరించిన వేలిముద్ర
ప్రచురణ: సాహితీ స్రవంతి, విజయవాడ, గుంటూరు, పేజీలు:95, వెల: ఇరవైరూపాయిలు, ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

స్వీకారం



గయోపాఖ్యానము
వెల 30/-,
పేజీలు114
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

కవిత-2004
వెల 73/-, పేజీలు91
ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని షాపులలో లభించును



హరహర మహాదేవ శంభో శంకర

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము

శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా

దేవస్థానములో ప్రత్యేక పూజలు

రాహు - కేతు కాల సర్పదోష నివారణ పూజలు

రాహు - కేతు స్వరూపులై ఇచ్చట వెలసిన శ్రీకాళహస్తీశ్వరులను ఆరాధించిన దోష నివృత్తులగుదురు. పూజా రుసుము: రూ. 250/-

ప్రత్యేక రాహుకేతు పూజ : రూ. 500/-

ఆలయం లోపల : రూ. 1000/-

పూజా వేళలు : ఉ॥ 6.00గం॥ నుండి రా॥ 8.30 వరకు.

పూజా వస్తువులన్నియు దేవస్థానమువారు అందజేయుదురు.

వజ్రకిరీటం

శ్రీ జ్ఞాన ప్రసూనాంబ వారికి కోటి రూపాయలతో వజ్రకిరీటము చేయదలచినాము. భక్తులు విరివిగా విరాళములు ఇచ్చి శ్రీ అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని మనవి.

80 (జి) ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

నిత్యం జరుగు అభిషేకాలు

నిత్య కళ్యాణోత్సవము	పంచామృతాభిషేకం
రుద్రాభిషేకం	సహస్రనామార్చన
పాలాభిషేకం	శనీశ్వరాభిషేకం

శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్లను దర్శించి, శ్రీ స్వామి అమ్మవార్లను సేవించి తీర్థప్రసాదాలను స్వీకరించి కృపాకటాక్షములకు పాత్రులు కాగలరు

భక్తుల విరాళాలతో నడుపు పథకములు

నిత్యాన్నదాన పథకము



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమును దర్శించుటకు వచ్చు భక్తులకు ఉచితంగా భోజనాన్ని అందించాలనే సత్సంకల్పంతో దేవస్థానమువారు నిర్వహించు ఈ పథకానికి భక్తులొక్కరిచ్చిన రూ. 1,115పై వచ్చు వడ్డీతో ఒకరు ఆ దాత పేరిట 10 మందికి అన్నదానం చేయబడుతుంది. భక్తుల విరాళాలే ఈ పథకానికి ప్రాణం. విరాళాలు ఎంత మొత్తమైననూ పంపవచ్చును. 80 జి ఆదాయపు పన్ను మినహాయింపు కలదు.

కాటేజీల నిర్మాణం

శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు వసతి సదుపాయాలను ఇతోధికంగా పెంచాలన్న సంకల్పంతో భక్తుల ఆర్థిక సహకారంతో ఒక్కొ గది 2 లక్షల రూపాయలతో నిర్మించదలచాము. దాతలకు సంవత్సరములో 30 రోజులు ఉచిత వసతి కల్పించబడును. కైలాసనాధుని కోవెల సమీపంలో కాటేజీల నిర్మాణం మోక్షానికి మార్గం.

- ☆ భరద్వాజ తీర్థంనందు 300 కాటేజీల నిర్మాణానికి ప్రతిపాదన
- ☆ విరాళాల దాత పేర కాటేజీల నిర్మాణం.
- ☆ ఆలయ గోపురాలకు వెండి మకరతోరణాలు
- ☆ 2 కోట్లతో ఆలయ పరిసరాలు అభివృద్ధి

అన్ని విరాళాలను : డి.డి.లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని శాఖలలో కమీషను లేకుండా పొంది "కార్యనిర్వహణాధికారి, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానము, శ్రీకాళహస్తి" పేరున పంపగలరు.

శ్రీ ఎస్.సి.వి. నాయుడు

ఎం.ఎల్.ఎ, శ్రీకాళహస్తి

శ్రీ ఎన్. సోమశేఖర్, బి.కాం., బి.ఎల్.

కార్యనిర్వహణాధికారి

మరియు జాయింట్ కమిషనర్

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డుమీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:

కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్టీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : చియ్యాద్రి రమ్యశుభ
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, పుస్తకాలు చదవడం
స్కూలు : చీమకుర్తి గురుకుల బాలికల పాఠశాల
చిరునామా : సిహెచ్. రమ్యశుభ, డాటరాఫ్ సిహెచ్. వెంకట సుబ్బయ్య, గోపాలనగరం 2వ లైను, ఇం.నెం: 1-192, ఒంగోలు, ప్రకాశం.

పేరు : నర్లా వెంకటేశ్వరరెడ్డి
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : పుస్తకాలు, ప్రజాశక్తి పేపరు చదవడం
స్కూలు : శ్రీ వివేకానంద విద్యాపీఠం
లక్ష్యం : కంప్యూటర్ ఇంజనీరు కావడం
చిరునామా : నర్లా వెంకటేశ్వరరెడ్డి, సన్నాఫ్ ఎన్. శ్రీనివాసులరెడ్డి, విజయా టాకీసు రోడ్డు, ఇం.నెం: 10-733(a), మార్కాపురం, ప్రకాశం.

పేరు : ఎన్. నవభావన
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు : డాన్స్ చేయడం, ఆటలు ఆడుకోవడం, స్నేహం చేయడం పుస్తకాలు చదవడం
స్కూలు : కిరణ్ కాన్వెంట్
చిరునామా : ఎన్. నవభావన, డాటరాఫ్ ఎన్.అర్జున్, ఇం.నెం: 7-121, మర్లు, శేషాద్రినగర్, మహబూబ్‌నగర్.

పేరు : ఎ.ఐశ్వర్య
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, సైకిల్ తొక్కడం, చిన్నపిల్లలతో కబుర్లు చెప్పడం, క్యారమ్స్ ఆడడం.
చిరునామా : ఎ.ఐశ్వర్య, డాటరాఫ్ ఎ.మూర్తి, మహబూబ్‌నగర్.

పేరు : బి.శాంతకుమారి
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ఆటలు ఆడడం, పుస్తకాలు చదవడం, స్నేహితులతో కబుర్లు చెప్పడం
లక్ష్యం : లాయర్ కావడం
చిరునామా : బి.శాంతకుమారి, డాటరాఫ్ బి.జాల్హి, శాంతినగర్, వైరా.

పేరు : జల్లా వంశీ
వయసు : 15 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, ప్రజాశక్తి దీపిక చదవడం
స్కూలు : జివిఆర్ మోడల్ పాఠశాల
లక్ష్యం : డాక్టరు కావడం
చిరునామా : జల్లా వంశీ, సన్నాఫ్ జల్లా చంద్రశేఖర్, ఇం.నెం: 28-823, విద్యానగర్, మిర్యాలగూడ-508207.

పేరు : షేక్ వహిజాన
వయసు : 10 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, క్యారంబోర్డు ఆడడం, డ్యాన్స్ చేయడం.
చిరునామా : షేక్ వహిజాన, డాటరాఫ్ డాక్టర్ షేక్ వలీసాహెబ్, కేరాఫ్ షాహినా ప్రజావైద్యశాల, యర్రగొండపాలెం, ప్రకాశం.

పేరు : ఎన్.పరిమళారాణి
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ప్రజాశక్తి పేపరు చదవడం, కలంస్నేహం చేయడం, బొమ్మలేయడం.
స్కూలు : చైతన్య సెంట్రల్ స్కూలు
చిరునామా : ఎన్.పరిమళారాణి, డాటరాఫ్ ఎన్.అర్జున్, ఇం.నెం: 7-121, మర్లు, శేషాద్రినగర్, మహబూబ్‌నగర్.